ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నల్లగొండ : fb.com/vaartha

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

11-11-2024 సోమవారం సంపుటి: 30 సంచిక: 283 పేజీలు: 8+16 వెల: 6.50



ఐదుగురు ఐఎఎస్ ఆఫీసర్ల బదలీ.. 2
ప్రముఖ తమిళ నటుడు ఢిల్లీ గణేశ్ కన్నుమూత 5


# ప్రాజెక్టులపై ప్రతినెలా సమీక్ష

## ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేస్తా

## అభివృద్ధి అడ్డుకుంటే చరిత్రహీనులవుతారు

## ప్రతిగ్రామానికి బిటిరోడ్డు

## కురుమూర్తి స్వామిని దర్శించుకున్న సిఎం రేవంత్



మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో ఆదివారం జరిగిన సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్, నవంబరు 10, ప్రభాతవార్త:** పాలమూరును అభివృద్ధి చేస్తామని నమ్మి కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపిస్తే పదేండ్లు పాలమూరును పట్టించుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకముందు రాజగోపురం వద్ద శ్రీ కురుమూర్తి స్వామి కొండపైకి ఘాట్ రోడ్డు మార్గం ఏర్పాటుకు రూ.110 కోట్లతో చేపడుతున్న పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అక్కడి నుండి కొండపై గల ముఖద్వారం వద్దకు చేరుకోగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ బూర్గుల రామకృష్ణారావు తర్వాత పాలమూరు బిడ్డగా తనకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందన్నారు. వలసలకు మారుపేరు పాలమూరు ఉండేదని, కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నా పాలమూరు బీడుగా మారిందన్నారు. 2009లో కేసీఆర్ కరీంనగర్ నుంచి పాలమూరుకు వలస వస్తే మన జిల్లా బాగుపడుతుందని ఆశించి పాలమూరులో ఊరు లేకపోయినా పార్లమెంట్ మన జిల్లా గురించి నోరు తెరవకపోయినా అందరూ ఆశీర్వదించి కేసీఆర్‌ను పార్లమెంట్‌కు పంపిస్తేనే తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన భాగస్వామ్యం ఉందన్నారు. కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా పాలమూరు ప్రాజెక్టులు జూరాల, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పదేండ్లలో పూర్తి కాలేదన్నారు. పాలమూరుకు ఒక్క పరిశ్రమ తేలేదన్నారు. అందుకే వలసలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. నెహ్రూ స్ఫూర్తితో ఆధునిక దేవాలయాలైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ఎడారిగా ఉన్న పాలమూరును పచ్చని పైరుతో విలసిల్లేలా చేస్తామన్నారు. ప్రతి నెలా జిల్లా ప్రాజెక్టులను సమీక్షించి జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేయడానికి వేగంగా అడుగులు వేస్తున్నామన్నారు. మక్తల్, నారాయణపేట,కొడంగల్ ప్రాజెక్టు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే మక్తల్ నారాయణపేటకు సాగు

>>2



## విజయోత్సవాల్లో రైతుభరోసా

## రూ.7 వేల కోట్లు అంచనా..

## రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తవుతున్న వేళ రైతులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఏడాదైన సందర్భంగా నిర్వహించనున్న ప్రజా విజయోత్సవాల్లో రైతు భరోసా నిధులు విడుల చేయనుంది. ఒక ఎకరా నుండి మొదలు పెట్టి, డిసెంబరు చివరి నాటికి రైతుభరోసా పెట్టుబడిసాయం చెల్లింపులు పూర్తి చేయాలని భావిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా కింద 15వేలరూపాయల మేర పెట్టుబడి సాయాన్ని జమచేయనుంది. దీనికిసంబంధించి కసరత్తు కూడా దాదాపు పూర్తయింది. ప్రజాభిప్రాయ సేకరణలో రకరకాల విజ్ఞప్తులు రాగా వాటిని క్రోడీకరించి 8ఎకరాల వరకూ రైతు భరోసా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన తెలంగాణలో సాగు భూమి 1.39 కోట్ల ఎకరా లు ఉండగా, రైతు భరోసాకు సుమారు 7 వేల రూపాయలు అవసరమవుతాయని అంచనా. ప్రతీ 10 రోజులకు 1,500 కోట్ల రూపాయల నుండి 2వేలకోటనరూపాయల వరకూ రైతు భరోసా పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. మొత్తం45రోజుల్లో కనీసం 7వేలకోట్ల రూపాయలను రైతులఖాతాల్లో జమచేయనుంది. రైతు భరోసా నిధులసర్దుబాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖను ప్రభుత్వం ఆదేశించింది. కాగా ఇప్పటికే రైతు భరోసా పథకాన్ని అమలు చేయకపోవడంతో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఏడాది గడుస్తున్నందున ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ సమయంలో విపక్ష పార్టీల నుండి మరింత విమర్శనాస్త్రాలు వస్తాయనే ఉద్దేశ్యంతో ఏదో విధంగా రైతు భరోసా నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది.

## ఐఎఎస్ అమోయ్‌కుమార్‌పై

# మరో భూ కబ్జా కేసు

### నాగారం కేసుపై పోలీసుల పునఃపరిశీలన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు10:** ఐఎఎస్ అమోయ్‌కుమార్ చుట్టు భూకబ్జా ఆరోపణలు, ఫిర్యాదులు మరింత పెరుగుతున్నాయి. తాజాగా ఆయనపై మరో ఎఫ్ఐఆర్ నమోదు కానుంది. ఈడీ, పోలీసుల జాయింట్ ఇన్వెస్టిగేషన్‌తో భూ ఆక్రమాలకు పాల్పడిన అధికారులు, ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వ రం మండలంలోని నాగారం భూదాన్ భూముల కేసును పోలీసులు మళ్లీ రీఓపెన్ చేయనున్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులైన అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోనున్నారు. ప్రధానంగా అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమోయ్ కుమార్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చే అవకాశాలున్నాయి. ఈ క్రమంలోనే ఈడీ అధికారులు మనీలాండరింగ్ యాక్ట్ కింద అరెస్టులకు రంగం సిద్ధం చేశారు. ఈ కేసుతో పాటు ఈడీకి

>>2



## కొత్త సిజెఐ నేడు ప్రమాణం

**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివైచంద్రచూడ్ పదవీ కాలం ఆదివారంతో ముగిసింది. దీనితో సుప్రీంకోర్టులో అత్యంత

>>2

# ఘోష్ విచారణలు పూర్తయ్యేనా?

### డిసెంబరు 31లోగా నివేదికపై సర్వాత్రా అనుమానం

### కాలపరిమితి పొడిగింపుపై సర్కార్ మీనమేషాలు

### ఇంకా విచారణ జరగని కెసిఆర్, హరీశ్‌రావు



**హైదరాబాద్,నవంబరు 10,ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ విచారణ చేస్తున్న జస్టిస్ పిసిఘోష్ కమీషన్ కాలపరిమితి పెంచడంలో తెలంగాణ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. మేడిగడ్డ కుంగుబాటుపై కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జస్టిస్ పిసిఘోష్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసి వందరోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరింది. ఆ కమిటీ ఏర్పాటు చేయడంతో దేశంలో సార్వత్రిక ఎన్నికల నగారా మ్రోగడంతో అధికారులు ఎవరు ఆయనకు అందుబాటులో లేకపోవడంతో మొదటి వందరోజులు గడువు విచారణ కార్యక్రమం ఆరంభించకుండానే జూన్‌లో ముగిసింది. తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 31కి విచారణ కాలపరిమితిని పెంచింది. పిసిఘోష్ సాంకేతికపరమైన సాహాయం తీసుకోవడంకోసం తనకుంటూ ఒక బృందం కూడా ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాకుండా ఎన్‌డిఎస్‌ఎ విజిలెన్స్ రిపోర్టులు కూడా ఆయన ఆహ్వానించారు. విచారణ ప్రక్రియ మధ్యలో ఉండగానే మరోమారు ఆగస్టు 31కి ఇచ్చన గడువు ముగియడంతో మళ్ళీ అక్టోబర్ 30 వరకు దాని కాలపరిమితి పెంచారు. ఇప్పటికి మూడు సార్లు పిసిఘోష్ విచారణ కమిటీ కాలపరిమితి పెంచారు. ఈ మూడు దశలలో నీటిపారుదలశాఖ ఇంజనీర్లను,

>>2




# క్రోని క్యాపిటల్స్ నుంచి జార్ఖండ్‌ను రక్షించండి



## ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

## విద్వేషాలను రగిలించే వారికి దేశాన్ని అప్పగించకూడదు

## ఎన్నికల ప్రచారంలో తెలంగాణ డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 10:** అదానీ, అంబానీ వంటి కొద్దిమంది క్రోనీ క్యాపిటలిస్ట్ నుంచి జార్ఖండ్‌కు విముక్తి కల్పించండి.. ఇండియా కూటమి అభ్యర్థులను తాజా ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలి పించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఏఐసిసి సీనియర్ పరిశీలకుడు, స్టార్ క్యాంపెయినర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం జార్ఖండ్ రాష్ట్రం రాంఘర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ మీటింగ్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఝార్ఖండ్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ఏఐసీసీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మల్లికార్జునఖర్గే నాయకత్వంలో రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా చేసిన జోడో యాత్రతో దేశం లో ప్రజాస్వామిక శక్తులను ఏకం చేశారని అన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ రెండు సందేశాలు ఈ దేశానికి ఇచ్చారని వివరించారు. విద్వేషాలను రగిలించే వారి చేతిలో ఈ దేశాన్ని పెట్టేందుకు మేము సిద్ధంగా లేము, విశాల భారతదేశంలో ప్రేమ అనే దుకాణం తెరిచి అన్ని జాతులు, మతాలకు సమాన అవకాశాలు ఇస్తామని సందేశం ఇచ్చారని వివరించారు. అదే సందర్భంలో ఈ దేశంలోని వనరులు, సంపద, ప్రభుత్వ రంగ సంస్థలు ఈ దేశ ప్రజలకే చెందాలి తప్ప కొద్ది మంది క్రోనీ క్యాపిటల్ లిస్ట్ ల చేతిలో పెట్టేందుకు సిద్ధంగా లేమని సందేశం ఇచ్చారని తెలిపారు. అదాని, అంబానీ వంటి క్రోనీ క్యాపిటల్ లిస్ట్ ఈ దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పోరాటం చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే ఝార్ఖండ్ వనరులు రక్షించబడతాయని అన్నారు. ఈ దేశ సంపద జనాభా నిష్పత్తికి అనుగుణంగా పంపిణీ జరగాలి అంటే రాజ్యాంగాన్ని రక్షించుకొని ముందుకు పోవాలి అందుకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించడమే మన ముందు ఉన్న లక్ష్యం అని తెలిపారు. కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో జార్ఖండ్ రాష్ట్రాన్ని పెట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని చైతన్యం గల కాంగ్రెస్ కార్యకర్తలు ఝార్ఖండ్ రాష్ట్రాన్ని, ఇక్కడి వనరులను ఆ దోపిడీ దారుల నుండి కాపాడు కోవాల్సిందిగా పిలుపు నిచ్చారు. ఝార్ఖండ్ ప్రజలు డబ్బుకు లొంగి పోయే రకం కాదని వాళ్ళకి వివేచన, విచక్షణ ఉందనీ ఆ పరంపరను కాపాడాల్సిందిగా పిలుపు నిచ్చారు. బ్లాక్, గ్రామ కాంగ్రెస్, పోలింగ్ బూత్ అధ్యక్షులు సమావేశమై విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

ఇండియా కూటమి ఇస్తున్న హామీలు, మేనిఫెస్టోను ఓటర్లకు పెద్ద ఎత్తున వివరించాలని, విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాంఘర్ అభ్యర్థి మమతా దేవిని భారీ మెజార్టీతో గెలిపించాలని, అలాగే కూటమి అభ్యర్థులను అందరినీ గెలిపించాలన్నారు. ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఏఐసీసీ నాయకులు గులాం అహమద్ మీర్, ఏఐసీసీ సెక్రటరీ సిరివెళ్ల ప్రసాద్, ఝార్ఖండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ కేశవ్ కమలేష్ మహతో, షహ నాజ్ అన్వర్, మైనారిటీ సెల్ అధ్యక్షులు తారిక్ అన్వర్, షకీల్ అహ్మద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నియోజక వర్గ నాయకులు, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# పగటి కలలు కంటున్న కెసిఆర్

## టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** కెసిఆర్ అధికారంలోకి వస్తామని పగటి కలలుకంటున్నారని ప్రజలు మాత్రం ఆయనను భరించే పరిస్థితిలో లేరని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. ఎన్నికల్లో వందశాతం మనమే అధికారంలోకి వస్తామని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యలపై "ఎక్స్"వేదికపై టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ స్పందిస్తూ కూల్చడానికి మాత్రమే ఈ ప్రభుత్వం అంటున్నావ్ కెసిఆర్ మీరు కూల్చిన వ్యవస్థలను నిర్మిస్తున్నామని తెలిపారు. మీ అవినీతి క్షేత్రాలను కూల్చడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకొందని ఆయన తెలిపారు. బురుదలలో మట్టిలో చెరువులో మీరు చేసినంత అవినీతి ఎవరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాటు ఎక్కడ ఉన్నాడో ఆయనకు అర్థం అవుతుందా అని ప్రశ్నించారు. ప్రజలకు దూరంగా ఉన్నా ఆయన మళ్ళీ సర్కారు వస్తదని భ్రమ పడుతున్నారని ఆయన ఎద్దేవా చేస్తూ వ్యాఖ్యలుచేశారు. బయట మీ అల్లుడు కొడుకు చేస్తున్న విధ్వంసం చూడండి అని కెసిఆర్‌పై నిప్పులు చెరిగారు. ఎంతో ఫ్రస్టేషన్‌తో కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోస్తున్నారని ఆయన అన్నారు. కూల్చడానికి కాదు నిర్మించడానికి అని కెసిఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ పునర్నిర్మాణం బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొందని ఆయన అన్నారు. మూసి శుభ్రం చేసి అక్కడి ప్రజలకు ప్రత్యామ్నాం చూపడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వండి అని ఆయన తెలిపారు.

# మహారాష్ట్రలో తెలంగాణ కాంగ్రెస్ నేతల విస్తృత ప్రచారం

## దిగ్రాస్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపి మల్లు రవి

## చంద్రపూర్‌లో ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలతో భేటీ

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** మహారాష్ట్ర ఎన్నికల ప్రచా రంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు విస్తృతంగా పాల్గొంటున్నారు. తెలంగాణలో గ్యారెంటీలతో సంక్షేమ కార్యక్రమాలు ప్రజల వద్దకు తీసుకెళ్ళిన తీరును వివరిస్తూ మహా ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు కార్యకర్తలను వ్యూహాత్మకంగా క్షేత్రస్థాయిలో ఎన్నికల కదనరంగంలో కదిలిస్తున్నారు. ఆదివారం యావత్మాల్ పార్లమెంట్ ఇంచార్జీగా మల్లురవి పలు ప్రచారకార్యక్రమాల్లో పాల్గొన్నారు. దిగ్రాస్ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించే బహిరంగసభకు మల్లురవి ప్రత్యేక ఆకర్షణ కాబోతున్నారు. ఉద్ధవ్‌ఠాక్రేతో ఆయన సభా వేదిక పంచుకోబుతున్నారు. స్థానిక నేతలతో కలిపి ఉద్ధవ్‌ఠాక్రే ముఖ్యఅతిథిగా పాల్గొనబోయే సభావేదికను ఆయన పరిశీలించారు. జన సమీకరణకు తగిన సూచనలు కూడా ఆయన ఇచ్చారు. ఇక కాంగ్రెస్‌పార్టీ గ్యారెంటీ కార్డులను చంద్రపూర్ లోక్‌సభ నియోజకవర్గంకుగాను ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరించారు. చంద్రపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మంట్లలోని కాంగ్రెస్ కార్యకర్తలతో ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో ఓటర్ల మనసును గెలుచుకోవాలని ఆయన సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఆదివారం సాయంత్రం ముంబాయికి బయల్దేరి వెళ్లారు.

# పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూలం

## ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

## మలేసియాలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చిన సులభతర వాణిజ్య విధానాలతో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడిందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఆదివారం మలేసియాలో జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. కౌలాలంపూర్‌లో స్థానిక తెలంగాణ ఎన్‌ఆర్‌ఐల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకురావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. మలేసియా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పెట్టుబడులతో వచ్చే వారందరికి హైదరాబాద్ ఎంట్రీ పాయింట్‌గా ఆహ్వానం పలుకుతుందన్నారు. డిసెంబరులో తెలంగాణలో పర్యటించేందుకు తాము అన్ని ఏర్పాటు చేస్తున్నామని అక్కడి పారిశ్రామిక వేత్తలు వివరించారు. ప్రజాప్రతినిధిగా 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న తనకు అభినందనలు తెలిపిన వారందరికి మంత్రి దన్యవాదాలు తెలిపారు. రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పార్టీలో ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తూ వచ్చిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గేలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. నలుగురు సిఎంల వద్ద మంత్రిగా పనిచేశానని, వారు తన పట్ల ఎంతో ఆదరాభిమానాలు కనబరిచారని మంత్రి తెలిపారు.

**తెలంగాణ బియ్యాన్ని మేము దిగుమతి చేసుకుంటాం..**

తెలంగాణ బియ్యాన్ని తాము దిగుమతి చేసుకుంటామని మలేషియా దిగుమతిదారులు హామి ఇచ్చారు. మలేసియా బిజినెస్ మీట్‌లో పరి శ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సాట్ చైర్మన్ శివసేనరెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్, విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పాల్గొన్నారు. తెలంగాణలో పండుతున్న వ్యవసాయ అభివృద్ధి గురించి మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణలో సాగు చేస్తున్న వరి, ధాన్యం రకాల గురించి, నాణ్యత, తదితర అంశాలను మలేసియన్ బిజినెస్ మీట్‌లో వివరించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య వివరించారు. తెలంగాణ బియ్యాన్ని తాము దిగుబడి చేసుకుంటామని హామీ ఇచ్చారు.



ఆదివారం మలేసియా బిజినెస్ మీట్‌లో పాల్గొన్న ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌రాబాబు, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సాట్ చైర్మన్ శివసేనరెడ్డి

# ఆర్టీసీ బస్సులో అంధ యువకుడి ప్రతిభ

## అభినందించిన టిజిఎస్‌ఆర్టీసీ ఎండి సజ్జనార్

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త :** టాలెంట్‌కు అంధత్వం అడ్డం కాదని నిరూపించాడో యువకుడు. ఆర్టీసీ బస్సులో అతను ప్రసన్నాంజనేయం భజే అంటూ రెండు చేతులా తాళం వేస్తూ తన కాళ్లతో దరువేస్తూ తోటి ప్రయాణికులను అలరించారు. సోషల్ మీడియాలో ఈ అంధుని ప్రదర్శన వైరల్ కావడంతో టీ ఆర్టీసీ ఎండి విసి సజ్జన్నార్ అభినందించారు. సజ్జన్నార్ ఆ యువకుడి టాలెంట్‌కు ప్రశంసల వర్షం కురిపించాడు. బ్లైండ్ కుర్రాడు పాడిన పాటను ఆయన సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మనం చూడాలే కానీ ఇలాంటి మట్టిలో మాణిక్యాలు ఇంకెన్నో అంటూ ట్వీట్ చేశారు. ఈ అంధ యువకుడు ఎంత అద్భుతంగా పాడారు కదా ఒక అవకాశం ఇచ్చి చూడండి అంటూ టాలీవుడ్ ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణికి ట్యాగ్ చేశారు.

# సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరో ఘనత

## ఆరు నెలల వ్యవధిలో కరుడుగట్టిన 165 మంది సైబర్ నేరగాళ్ల పట్టివేత

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరో ఘనతను అందుకుంది. గత ఏప్రిల్ నుంచి ఆరు నెలల వ్యవధిలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 165 మంది కరుడుగట్టిన సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. రాష్ట్రంలో గత ఏప్రిల్ నెలలో కొత్తగా ఆరు సైబర్‌క్రైం పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేసిన తరువాత ఆయా ప్రాంతాల్లో నమోదవుతున్న సైబర్ నేరాలను హైదరాబాద్‌లోని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు స్వయంగా విచారించ సాగారు. ఈ ఆరు పోలీసుస్టేషన్లకు అధికారులున్నా అజమాయిషీ అంతా హైదరాబాద్‌లోని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారు లదే కావడం గమనార్హం. ఈ పోలీసు స్టేషన్లు ఏర్పాటైన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసులకు సంబంధించి సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు వేగంగా విచారణ చేబట్టి దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో వున్న నేరగాళ్లను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పంపు తుండడంతో మెరుగైన ఫలితాలు రాసాగాయి. ఈ క్రమంలోనే తక్కువ వ్యవధిలో 165 మంది నేరగాళ్లు పట్టుబడ్డారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో నమోదైన 76 కేసుల్లో వీరు నిందితులుగా తేలగా మొత్తం మీద తెలంగాణవ్యాప్తంగా వున్న 795 కేసులు, దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న 3357 కేసుల్లో వీరు నిందితులుగా తేలింది. పట్టుబడ్డ నేరగాళ్లలో తెలంగాణతోపాటు ఎపి, అసోం, ఢిల్లీ, ఒడిశా, గుజరాత్, రాజస్తాన్, జార్ఖండ్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర, బెంగాల్‌కు చెందిన వారుగా తేలింది. కాగా అరెస్టయిన నేరగాళ్లలో 45 శాతం మంది డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యువేట్ చదివిన వారు కాగా 34 మంది పదవ తరగతి అంతకన్నా తక్కువ చదివిన వారు వున్నారు. 21 శాతం మంది సొంతంగా ఉపాధిపొందిన వారు కాగా తొమ్మిది శాతం మంది విద్యా ర్థులు ఉన్నారు. మూడు శాతం నేరగాళ్ల ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు, 14 శాతం నిరుద్యోగులు ఉన్నారు. ఇక నేరగాళ్ల వయో పరిమితి వరకు వస్తే 49 శాతం మంది 21 నుంచి 30 యేళ్లలోపు వుంటే 28 శాతం మంది 31 నుంచి 40 యేళ్ల మధ్య వున్నారు. 10 శాతం మంది 41 నుంచి 50 యేళ్ల వయస్సు కలిగిన వారు వున్నారు. సైబర్ నేరాల వివరాలను పరిశీలిస్తే ఎక్కువగా పార్ట్‌టైం ఉద్యోగాలు, పెట్టుబడుల స్కాం వున్నాయి. దీంతోపాటు డిజిటల్ అరెస్టు, లోన్ ఫ్రాడ్, వ్యాపారం మోసాలు, సైబర్‌స్లావెరి, హ్యాకింగ్, అడ్వర్‌టైజ్‌మెంట్ ఫ్రాడ్, మ్యాట్రి మోనియల్ ఫ్రాడ్, డేటింగ్ యాప్‌కు సంబంధించిన నేరాలు కూడా ఉన్నాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖాగోయల్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించడంతోపాటు అన్నివర్గాల ప్రజలు సైబర్ నేరగాళ్ల విషయంలో నిరంతరం జాగ్రత్తగా ఉండాలని కోరారు. సైబర్ నేరగాళ్లు ఏ రకంగా అయినా మోసాలకు పాల్పడే వీలుండడంతో అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

# విజయ డెయిరీ బకాయిల్లో రూ.50 కోట్లు విడుదల

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** పాడి రైతులకు పాల బకాయిలు చెల్లించనుంది. ఈ మేరకు ఒక నెల పెడింగ్ బిల్లుల చెల్లింపు కోసం 5 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ పెండింగ్ నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మరో నెల బకాయిలను కూడా త్వరలోనే చెల్లించనున్నట్లు వెల్లడించారు. కాగా పాడి రైతుల నుండి 4.4 లక్షల లీటర్లను విజయ డయిరీ కొనుగోలు చేస్తోంది. అయితే ఇటీవల కాలంలో నిధుల సమస్య ఏర్పడింది. దీంతో పాల బిల్లు పెండింగ్‌లో పడ్డాయి. తాజాగా వాటిని ఒక్కొక్కటిగా అధికారులు విడుదల చేస్తున్నారు.

# కర్ణాటకకు రాష్ట్ర ఫిషరీస్ బృందం

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** చేపల పెంపకం, విక్రయం, మార్కెట్లకు సంబంధించి అధ్యయనం చేసేందుకు రాష్ట్ర మత్స్య శాఖ అధికారుల బృందం కర్నాటకలో పర్యటిస్తోంది. ఆదివారం ప్రారంభమైన పర్యటన ఈ నెల 13వ తేదీ వరకూ కొనసాగనుంది. మత్స్య సహకార సంఘం ఛైర్మన్ మెట్టు సాయి ఆధ్వర్యంలోని అధికారుల బృందం వివిధ అంశాలపై పరిశీలన చేయనుంది. మత్స్య పారిశ్రామికాభివృద్ధి, కార్మికుల జీవనోపాధి, వారి ఆదాయం పెంపుదల వంటి అంశాలపై తెలంగాణలో నూతన పాలసీని తీసుకురావాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఈ నూతన పాలీ రూపకల్పనలో భాగంగానే కర్నాటకలో పర్యటించిన తదుపరి ఈ బృందం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

# పప్పుదినుసుల్లో కేంద్రం కృషి అంతంతే

## రిజర్వ్ బ్యాంక్ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త :** స్వయం సమృద్ధికి అవకాశాలు ఉన్నా, పప్పు దినుసుల సాగులో అందుకు తగినట్లు కేంద్రం కృషి చేయడం లేదని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఇంకా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని తెలిపింది. దేశంలో ప్రధానమైన పప్పు దినుసులు పెసర, శనగ, కందులపై రిజర్వ్ బ్యాంక్ అధ్యయన నివేదికలో పేర్కొంది. ప్రంచ వ్యాప్తంగా పప్పు దినుసుల్లో ఇండియా 28 శాతం ఉత్పత్తి చేస్తోంది. అయితే 2022లో అవసరాల మేరకు 2.5 మిలియన్ టన్నులను దిగుమతి చేసుకుంటోంది. దేశీయ ఉత్పత్తుల కంటే 9 శాతం ఎక్కువ. కంది కొనుగోలు ద్వారా వచ్చే ప్రతీ రూపాయిలో రైతులకు 65 పైసలు, పెసర ద్వారా 70 పైసలు, శనగలకు 75 పైసలు లభిస్తోంది. ఉత్పత్తి అయిన ఖర్చు కంటే తక్కువ ధరలకే రైతులు విక్రయిస్తున్నారు. పప్పుల క్రయవిక్రయాలకు రైతులు మార్కెట్లకు తీసుకెళ్లడంతో రవాణాకు భారీగా ఖర్చవుతోంది. మార్కెట్లలో రుసుములు, ఇతర ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఇక ధర విషయంలో వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, టోకు, చిల్లర వర్తకులు, మిల్లర్ల మీదే ఆధారపడటంతో దోపిడీకి గురవుతూ మద్దతు ధరలు ఉన్నా అవి రావడం లేదని రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది.

# ఇద్దరు పిల్లలుసహా తండ్రి చెరువులో దూకి ఆత్మహత్య

## సిద్దిపేటలో తీవ్రవిషాదం

**సిద్దిపేట రూరల్, నవంబరు 10, ప్రభాతవార్త :** మానసికక్షోభకు గురైన ఓ తండ్రి తన పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషా ద ఘటన ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వాసవీ కాలనీలో తేలు సత్యం కుటుం బీకులతో నివాసముం టున్నారు. సత్యం మొదటి భార్య అనారోగ్యంతో మృతి చెందగా రెండో వివాహం చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. తన తమ్మునికి ఇచ్చిన రూ.5 లక్షల 50 వేలు తిరిగి ఇవ్వాలని అడుగగా తమ్ముడు శ్రీనివాస్ తన్న అన్న సత్యంను తిట్టి, చెప్పుతో కొట్టి ఇంటి నుంచి గెంటివేశాడు. దాంతో ఈ విషయాన్ని మనుస్సులో పెట్టుకొని మానసిక క్షోభకు గురైన సత్యం(48) శనివారం రాత్రి కుమారుడు అన్వేష్‌నంద(8), కూతురు త్రివేణి(6) లను వెంట తీసుకొని శనివారం రాత్రి కరీంనగర్ రోడ్డులోని చింతలచెరువులో దూకి ఆత్మహత్య చేసు కున్నట్లు పోలీసులు తెలిపారు. తన చావుకు కారణాన్ని సెల్ఫీవిడియో తీసి అలాగే సూసైడ్ నోట్‌రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

భర్తతోపాటు పిల్లలు కనిపించకపోవడంతో పిల్లలతో సహా చెరువులో దూకి మరణించడానికి తెలుసుకున్న భార్య శిరిషతోపాటు బంధువులో బోరున విలపించారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ పరిశీలించి శవాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ అనుపత్రికి తరలించారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దార్యాపు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

# బిసి కులగణనకు బిజెపి అనుకూలం

## బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపడుతున్న బిసి కులగణన చేయడం బిజెపి అందరి కంటే అనుకూలం అని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిసి గణనకు బిజెపి అనుకూలమా? ప్రతికూలమా? అని, ఎంపి డా.లక్ష్మణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేయడం హాస్యాస్పందంగా ఉందన్నారు. బిసిల పట్ల వ్యతిరేకంగా నెహ్రూ నుంచి మొదలై ఇందిరా, రాజీవ్, మన్మోహన్‌సింగ్ వరకు కేంద్రంలో మీ ప్రభుత్వ విధానాలు ఉన్నారయన్నారు. 1955లో నెహ్రూ ప్రభుత్వం వెనుబడిన తరగతుల కోటాను సిఫార్సును కాకా కలేకర్ కమిషన్ నివేదికను తిరస్కరించింది మీ నెహ్రూ ప్రభుత్వం కాదా అంటూ ప్రశ్నించారు. కులగణనపై ఏయే విషయాలు బిసి, ఎస్సీ, ఎస్టీలకు మేలు చేయాలి అని అనుకుంటున్నారో స్పష్టం చేయాలన్నారు.



వ్యక్తిగత విషయాలను తెలుసుకుని దాని ద్వారా ప్రభుత్వం ఏమి చేయాలి అనుకుంటున్నారో బహిరంగంగా చెప్పాలన్నారు. మీరు పేద ప్రజలకు మేలు చేయాలి, అంటే మీకు సొంత ఇళ్లు ఉందా లేదా? రేషన్‌కార్డు ఉందా లేదా అన్న విషయాలు ఎందుకన్నారు. మంత్రి బిసి సంక్షేమానికి పాటుపడి మీ ప్రభుత్వం ద్వారా ఒత్తిడి తెచ్చి మేలుచేయాలని, అంతేగానీ, లక్ష్మణ్ మీద, కిషన్‌రెడ్డిమీ ప్రకటనలు మానుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ప్రభుత్వం ద్వారా ఏం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి కార్యాలయ ఇంచార్జ్ ప్యారసాని వెంకటేష్, కోశాధికారి ఆకారం రమేష్‌లు పాల్గొన్నారు.

# హసీనా కోసం ఇంటర్‌పోల్ సాయం

## బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం వెల్లడి



**ఢాకా, నవంబరు 10:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమెను స్వద ేశానికి తీసుకు వచ్చేందుకు ఇంటర్‌పోల్ సాయం కోరతామని తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. నేరారోపణలకు సంబంధించి ఆమెతోపాటు దేశం వీడి వెళ్లిన అనేకమంది స్వదేశంలో విచారణ ఎదుర్కొనాల్సిందేనని ప్రకటించింది. ఇంటర్‌పోల్ ద్వారా త్వరలోనే రెడ్ కార్నర్‌నోటీసులు జారీచేస్తామని పారిపోయినవారు ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా తిరిగి స్వదేశానికి తీసుకువచ్చి కోర్టులో నిలెబడతామని బంగ్లాదేశ్ ప్రభుత్వ న్యాయవ్యవహారాల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ తెలిపారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లోజరిగిన విద్యార్థుల ఉద్యమంపై షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం అణచివేత ధోరణి తీవ్ర హింసకు దారితీసింది. ఈ క్రమంలో వందలాదిమంది మృతిచెందారు. అధికార గణాంకాలప్రకారం 753 మంది చనిపోగా వేలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. అందుకు సంబంధించి హసీనాతోపాటు ఆమెపార్టీ నేతలపైనా అనేక కేసులు నమోదయిన సంగతి తెలిసిందే. హసీనా ప్రస్తుతంభారత్ ప్రభుత్వ శరణార్థిగా ఆశ్రయం పొందుతున్నారు.

# యాసంగి 75.32 లక్షల ఎకరాల్లో సాగు

## 19.60 లక్షల టన్నుల ఎరువుల కోసం కేంద్రానికి ఇండెంట్

## రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం

## మద్దతు ధరలు పెంచిన కేంద్రం

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణలో వానాకాలం సీజన్ ముగి వాటి ఉత్పత్తులు మార్కెట్లకు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుత యాసంగి సీజనుకు వ్యవసాయ శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 75.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అంచనా వేసింది. గత ఏడాది యాసంగి సీజనులో 71.52 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఈ లెక్కన గత యాసంగి కంటే ఈ సారి అదనంగా దాదాపు 4 లక్షల ఎకరాలు ఎక్కువ. అలాగే గత ఏడాది రాష్ట్రంలోని 55.3 లక్షల ఎకరాల పంట భూములకు సాగు నీటి సదుపాయాన్ని అందించగా, ఈ సీజనులో 57.3 లక్షల ఎకరాలకు వివిధ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాల్వల కింద సాగు నీటిని అందించ వచ్చని లెక్కకట్టింది. ఈ యాసంగిలో సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా అవసరమైన ఎరువులను కూడా అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్రానికి 19.60 లక్షల టన్నుల మేర ఎరువులు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ ప్రణాళికలో అంచనా వేసింది. గత ఏడాది ఇదే యాసంగి సీజనుకు 15,99 లక్షల టన్నుల ఎరువులను రాష్ట్రానికి కేంద్రం కేటాయింపులు చేసింది. ఈ సారి అంత కంటే ఎక్కువగా 3.61 లక్షల టన్నులు అదనంగా అవసరం అవుతాయని భావిస్తోంది. ఇందులో యూరియా 9.8 లక్షల టన్నులు, డై అమ్మోనియమ్ ఫాస్ఫేట్ (డిఎపి) 1.6 లక్షల టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పి) 6 వేల టన్నులు, మ్యూరో ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) 7 వేల టన్నులు, కాంప్లెక్స్ 7 వేల టన్నులు వినియోగిస్తారని అంచనా వేసింది. ఈ ఎరువులను కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది.

అలాగే యాసంగిలో కొరత లేకుండా విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టింది. రైతుకు అందుబాటులో ఎరు వులు, విత్తనాలు ఉంచేలా చర్యలు చేపట్టింది. ఇందుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా తెలంగాణలో విత్తనాల నిల్వల వివరాల సమాచారాన్ని సేకరిస్తోంది. విత్తనాలకు ఎక్కడా కొరత లేకుండా చూస్తోంది. కాగా మరోపక్క 2024-25 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం సన్‌ఫ్లవర్, కందులు, శెనగ, ఆవాలు, గోధుమ, బార్లీ పంటలకు కనీస మద్దతు ధరను పెంచింది. దీని ప్రకారం రబీ (యాసంగి) సీజనులో గోధుమల కనీస మద్దతు ధరను రూ.150 పెంచడంతో క్వింటా ధర రూ.2,275కు చేరింది. అలాగే బార్లీ ధరను రూ.115 కు పెంపుదల చేయడంతో క్వింటాల్ రూ.1,850 కి చేరింది. ఇక శెనగ కనీస మద్దతు ధరను రూ.105 కు పెంచింది. ఈ పెంపుతో క్వింటా శనగ ధర రూ.5,440 క పెరిగింది. మసూర్ పంట మద్దతు ధర రూ.425 కు పెంపుదల వల్ల క్వింటాల్ రూ.6,425కు, ఆవాలు రూ.200 పెంచడం వల్ల క్వింటాల్ రూ.5,650, కుసుమ పంట మద్దతు ధర రూ.150కు పెంచడం వల్ల క్వింటాల్ ధర రూ.5,800 కు చేరింది.

వార్త

కొంత మందిని అదృష్టం వరిస్తుంది, చిత్రమేమిటంటే వారెప్పుడూ అదృష్టంపై ఆధారపడే వారు కాదు.

-ఎమర్సన్

# ట్రంప్‌రాకతో చైనాకు తప్పని చిక్కులు!


అగ్రరాజ్యం అమెరికాలో పాలన మార్పిడి జరగడంతోనే ఇప్పుడు ఆసియా అగ్రరాజ్యానికి ముచ్చెమటలు పడుతున్నాయి. అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన ఆసియాదేశంలో ఇప్పుడు కొత్త అధ్యక్షుడి పాలనలో అమెరికాతో ఉన్న సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలన్న లక్ష్యంపైనే అంతర్మథనం జరుగుతోంది. ఆసియా అగ్రరాజ్యం అయిన చైనాకు ట్రంప్ హయాంలో సంబంధాలు బెడిసికొట్టిన సంగతి తెలిసిందే. చైనా ఉత్పత్తులపై 200శాతం వరకూ సుంకాలు విధించడం ఆపై చైనా కూడా అమెరికా దిగుమతులపై తన సుంకాలను పెంచుకుంటూపోవడంతో రెండు దేశాల మధ్య ఒక విధంగా ట్రేడ్‌వార్ నడిచింది. దీనికి తోడు ఇప్పుడు తైవాన్ సమస్య కూడా ఒకటి మరింతగా చైనాకు చిక్కులు తెచ్చిపెట్టేదిగా ఉంది. స్వతంత్ర దేశంగా కొనసాగుతున్న తైవాన్ చైనా అంతర్భాగమని, సైనిక చర్యను చేపట్టి అయినా సరే తాము విలీనంచేసుకోక తప్పదని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గతంలోనే స్పష్టం చేసారు. అనుకున్నట్లుగానే ఇప్పటికీ చైనా గగనతలంపై యుద్ధవిమానాలు చక్కర్లు కొట్టడం, తైవాన్ జలాల్లోకి చైనా యుద్ధనౌకలు కూడా మొహరించడం జరుగుతూ వస్తోంది. ఈనేపథ్యంలో ఇప్పటివరకూ తైవాన్‌కు వెన్నుదన్నుగా ఉన్న అమెరికా వైఖరి ఇప్పుడు ఎలా ఉంటుందనేది చైనాను పీడిస్తున్న సందిగ్ధం. వాస్తవానికి ట్రంప్ హయాంలో తైవాన్‌ను స్వతంత్ర దేశంగా అమెరికా గుర్తించలేదు. అయితే అంగబలం, అర్థబలం, ఆయుధ బలం పరంగా ఆదేశానికి అండగా నిలిచింది. అదికాస్తా బైడెన్ హయాంకు వచ్చేసరికి తైవాన్‌కు మరింతగా అండదండలు లభించాయి.కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి.అమెరికాలో పాలన పునరేకీకరణ జరిగింది. మళ్లీ రిపబ్లికన్లు పాలనా పగ్గాలు చేపట్టడంతో అమెరికా ఆర్థిక పరిపుష్టితో పాటు ఇతర దేశాలతో తమకున్న దౌత్యసంబంధాలను పునఃసమీక్షించుకోవాల్సి న అనివవార్య పరిస్థితులు వచ్చాయి. ఈకోణం నుంచి చూస్తే ఇప్పుడు చైనా తనంత తానుగా కొరివితో తలగోక్కునే పరిస్థితిని ఎంతమాత్రం కోరుకోదు. ప్రధానంగా ముందునిలిచిన ట్రేడ్‌వార్‌కు సామరస్య పూర్వకమైన పరిష్కారం అన్వేషించుకోవాలి. అలాగే తైవాన్ సమస్యను కూడా శాంతియుత చర్చల మార్గంలోనే పరిష్కరించుకోవాల్సి న అవసరం ఎంతో ఉంది.అందువల్లనే ఇప్పుడు ట్రంప్ గెలిచిన వెంటనే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ రెండు సమస్యలపైనే దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో చైనా ఉత్పత్తులపై 360 బిలియన్ డాలర్లమేర సుంకాలు విధించారు. అలాగే చైనా ఎగుమతిచేసే అన్ని ఉత్పత్తులపైనా 60శాతం అదనపు సుంకాలు తప్పవని కూడా ఆనాడే హెచ్చరించారు. అందుకు అనుగుణంగానే తన వ్యాపార దృక్పథం వీడని ట్రంప్ అమెరికా ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధించే దేశాలకు గుణపాఠం తప్పదంటూ హెచ్చరికలు కూడా తన ప్రచారంలో వినిపించారు. ప్రత్యేకించి చైనా,భారత్‌లను పదేపదే ప్రస్తావించారు కూడా. అయితే తదనంతరం భారత్‌పట్ల తన వైఖరిని సరిదిద్దుకున్నారు. ఇప్పుడు చైనా ఉత్పత్తులపై విధించే అదనపు సుంకాల కారణంగా ఆదేశ ఆర్థికవృద్ధిలో 2.5 పర్సంటేజి పాయింట్లు తేడా వస్తోంది. ట్రంప్ హయాంలో విధించిన 360 బిలలియన్ డాలర్ల సుంకాలతో దిగివచ్చిన జిన్‌పింగ్ ఇరుదేశాల మధ్య సంప్రదింపులు జరిగాయి. చైనా తన మేధోసంపత్తి హక్కులను మెరుగుపరుచుకునేందుకు అంగీకరించింది. అలాగే 200బిలియన్ డాలర్ల అమెరికా ఉత్పత్తులు కొనుగోలుకు కూడా ముందుకు వచ్చింది. ఇప్పుడు చైనాపై అమెరికా మూడు కీలక అంశాలపైనే ఒత్తిడితెచ్చే అవకాశంఉంది.ఉక్రెయిన్ యుద్ధం విరమించేందుకు రష్యాతో చైనా రాయబారంతోపాటు తైవాన్‌కు చైనా నుంచి స్వేచ్ఛను కల్పించడం.ఇకమూడోది ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ దూకుడుకు చైనా మధ్యవర్తిత్వంతో కళ్లెం వేయడం అనే అంశాలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. వాస్తవానికిఉత్తరకొరియా, ఉక్రెయిన్‌ల పరంగా చైనాయే మధ్యవర్తిత్వానికి మంచిదని అమెరికా ముందు నుంచీ భావించింది. ఇప్పుడు చైనాతో సంబంధాలు బలపడేందుకు అమెరికా కూడా ఈ మూడు దేశాల వ్యవహారంలో చైనా జోక్యం కోసం ఒత్తిడిని పెంచే అవకాశం ఉందది. తైవాన్‌పై చైనా దండయాత్ర చేస్తే అమెరికా తన మద్దతును మరింత పెంచడంతోపాటుచైనా దిగుమతులపై 150 నుంచి 200శాతం సుంకాలు అదనంగా విధించే ప్రమాదం ఉంది. తైవాన్‌ను స్వతంత్ర దేశంగా అమెరికా గుర్తించకపోయినా అన్ని విధాలుగా అండదండలందిస్తోంది. 1979నుంచి చైనాతో దౌత్యసంబంధాలు కొనసాగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో లేవు. తైవాన్‌తో చైనా వ్యవహారశైలిపై ట్రంప్ అధ్యక్షుడుగాఉన్న కాలంలోనే తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసారు. ఇప్పుడు అదే పరిస్థితి వస్తే సుంకాలను మాత్రం రెట్టింపుస్థాయిలో పెంచడంతోపాటు తైవాన్ జోలికి వెళ్లకుండా అడ్డుకట్ట వేసేందుకు అన్ని అస్త్రాలను ప్రయోగిస్తారు.అయితే రెండోసారి ఎన్నికైన ట్రంప్ ముందున్న దూకుడు ప్రదర్శించకపోవచ్చు. జిన్‌పింగ్ తనను ఎంతో గౌరవిస్తారని, తాను ఎంత ఘటికుడినో అన్న విషయం ఆయనకు తెలియంది కాదని ప్రచారంలో చెప్పారు. అదే నిజమైతే తైవాన్‌పట్ల అమెరికా కొంత సడలింపు ధోరణి ప్రదర్శించినా ఆశ్చర్యపోనవసరంలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ట్రంప్ అమెరికా ఫస్ట్, అమెరికన్‌ఫస్ట్ నినాదం మరింత బలపరుచుకోవాలంటే అన్ని దేశాలతో మంచి సంబంధాలు నెలకొల్పుకోడానికే ప్రాధాన్యతనిస్తారని ఆయన ఎన్నికల ప్రచారమే స్పష్టం చేసింది. ఇక చైనా కూడా అదే దిశగా ముందుకు వెళ్లకపోతే రానున్న కాలంలో రెండుదేశాల మధ్య ట్రేడ్‌వార్ పతాక స్థాయికి వెళ్లకతప్పదని నిస్సంకోచంగా చెప్పుకోవచ్చు.

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీ రమణ మహర్షి

ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణకువతో మెలగాలి.



ఎమర్సన్

# ప్రజావాక్కు



## సమయ పాలన పాటించాలి

ఈ రోజుల్లో సమయం అందరికీ చాలా విలువైనది. అందరివీ బిజీ జీవితాలు.ఉరుకులు పరుగులమయం. చాలా మంది డాక్టర్లు నేడు సమయ పాలన పాటించడం లేదు. అది ప్రైవేటు ఆసుపత్రిలో కానీ ప్రభుత్వ ఆసుపత్రిలో కానీ చెప్పిన టైముకి రారు. పేషెంట్‌లు గంటల తరబడి క్యూలో నిలబడి కూర్చుని ఉన్నారుఅనే కనీస అవగాహన కుడా డాక్టర్లకు ఉండదు. రోగులు వృద్ధులు చిన్న పిల్లలు అంతసేపు కూర్చో లేక చాలా ఇబ్బంది పడతారు. కానీ డాక్టర్లకు ఇవ్వేమీ పట్టవు. రోగులతో పాటు వచ్చే సహాయకులు ఉద్యోగవ్యాపారాలలో కొంత బ్రేక్‌చేసుకుని వస్తారు. తక్కువ ఫీజుతీసుకునే వారి నుండి భారీఫీజులు వసూలు చేసే ఆసుపత్రులలో కూడా ఇదే పరిస్థితి. ప్రభుత్వ ఆసుపత్రులలో ఇదే తీరు. సమయం విలువ ఎటువంటిదో డాక్టర్లు గుర్తించాలి.కేవలం వారిసమయం మాత్రమే కాదు పేషంట్స్ టైం కూడా విలువైనదే అని గ్రహించాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

## కేసులను సత్వరమే పరిష్కరించాలి!

చోరీకి గురి కాబడిన 251 వాహనాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్వాధీనం చేసుకున్న ఏలూరు పోలీసులను ముఖ్యమంత్రి అభినందించారు.ఇలా స్వాధీనం కాబడిన వాహనాలు,పలుకేసుల్లో,వివాదాల్లో పట్టుబడిన వాహనాలు ఏళ్ళతరబడి పోలీస్ స్టేషన్ల వద్ద ఉండి,కేసులు పరిష్కారం కాక తుప్పుపట్టి పోతున్నాయి.చోరీకి గురికాబడిన వాహనాలను వాటి యజమానులకు తక్షణం అప్పజెప్పాలి.అలాగే వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల కేసుల సత్వర పరిష్కారానికి పోలీసులు చొరవచూపాలి.వాహన యజమానులు రాకపోయినా,సహకరించకపోయినా నిబంధనల మేరకు వాటిని వేలం వేయాలి.ముఖ్యమంత్రి గారు అన్నట్టు అవి తుప్పుపట్టి పోతే ఎవరికీ ఉపయోగం లేదు.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## అండర్ బ్రిడ్జిలను నిర్మించాలి

రెండు తెలుగురాష్ట్రాల్లోఅండర్ బ్రిడ్జిలనునిర్మించాలి.ఇంకా చాలా చోట్ల అండర్ బ్రిడ్జిలు నిర్మించుటకు సంబంధిత అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకోవాలి. రైల్వేశాఖ అండర్ బ్రిడ్జిలకు ప్రాధాన్యం ఇస్తుంది. అండర్ బ్రిడ్జిల నిర్మాణం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగదు.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

## పెరుగుతున్న సైబర్ నేరాలు

సైబర్ నేరాలురోజురోజుకు బాగా పెరిగిపోతున్నాయి. కనీసం రోజుకు 5 కోట్ల రూపాయలను ఈ నేరగాళ్లు అమాయకుల వద్దనుంచి కొల్లగొడుతున్నారు.ఏ లింకులు ముట్టవద్దని పదే పదేప్రభుత్వాలు ప్రకటనలిస్తున్నా పెడచెవిన పెట్టి నేరగాళ్ల పాలన పడికష్టపడి కూడా పెట్టుకున్న సొమ్ము వృధాగా పోగొట్టుకొంటున్నారు.ఇందులో బాగా చదువుకున్న వారు కూడా ఉండటం విచారకరం. పోలీసులు కూడా పరిష్కరించ లేని సమస్యగా మారుతోంది. సాఫ్ట్ వేర్ ఉద్యోగుల కన్నా ఎక్కువ సాంకేతిక విజ్ఞానాన్ని సైబర్ క్రిమినల్స్ సమ కూర్చుకున్నారనిపిస్తోంది.కృత్రిమ మేధస్సు వల్లలాభాలు ఎన్నిఉన్నా కష్టాలు, నష్టాలు అంతకుమించే ఉన్నాయి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఉన్నత చదువులు అందని ద్రాక్షే నా?

అగ్రరాజ్యం అమెరికాలో "డొనాల్డ్ ట్రంప్" ఎన్నికతో భారతీయ విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. విద్యార్థి వీసాలను తగ్గిస్తారనే వదంతులు మరీ ముఖ్యంగా "హెచ్ 1బీ" వీసాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలు మారనున్నాయి అనే వార్తలతో మన విద్యార్థులలో ఆందోళన చోటుచేసుకుంటుంది. ట్రంప్ మొదటి నుంచి ఇతర దేశాల నుంచి వలస వచ్చిన వారిపై కఠినమైన వ్యాఖ్యలు చేస్తున్నారు.అధికారంలోకి వచ్చిననాడే అక్రమ వలసలను అడ్డుకుంటామనిప్రకటించారు.అయితే ఎడ్యుకేషన్ వీసాల పట్ల "డొనాల్డ్ ట్రంప్" సానుకూలంగానే ఉంటారని, ఇది కొంత అనుకూలమని ఒక పక్క నిపుణులు అనడం గమనార్హం!

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## పొదుపు పాటించాలి

ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రభుత్వం, పోలీసు నిఘా వ్యవస్థ,అలెర్ట్ సూచనలు ఇస్తున్నప్పటికీ బ్యాంక్ ఖాతాలో డబ్బు పోతున్నది. ఫోన్‌తో లింక్ ఉన్న ఎస్ బి ఖాతాలకు ఇది ఎక్కువగా జరుగుతోంది. భారత్ తపాలశాఖ కూడా పొదుపు ఖాతాలకు ఆన్లైన్ సదుపాయం కల్పించింది. అయితే ఫోన్ బ్యాంకింగ్ పూర్తిగాలేదు.కానీ మన ఖాతాలకు ఏటీఎం సదుపాయం ఉంది. ఇండియాలో సంతకం సరిపోతే 25000 పరిమితి వరకు విత్‌డ్రా ఇస్తారు. కావున మధ్య తరగతి పొదుపు కోరేవారు పకడ్బందీ, రక్షణ, సదుపాయం ఉన్న ఖాతాలను తీసుకోవాలి. ఈ ఖాతాలో ఎటువంటి సైబర్ మోసాలు లేవు. అయితే కొంత నెమ్మదిగా వ్యవహారం జరుగుతుంది

-బొల్లోజు మెఘానాథమ్, విశాఖపట్నం

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# ఇ వ్యర్థాలు మానవాళికి ప్రమాదమే!

**ఇవ్యర్థాలు పల్లపు ప్రదేశాలను కలిసినప్పుడు, విషపూరిత రసాయనాలు నేల, నీటిలోకి ప్రవేశిస్తాయి. ఇది భూగర్భజల కాలుష్యానికి దారితీస్తుంది. ఇది మానవ ఆరోగ్యాన్ని మరింత ప్రభావితం చేస్తుంది. ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ పరికరాలు వాటి ఉపయోగక రమైన జీవితం తరువాత అవి ఇవ్యర్థాలుగా మారినప్పుడు వాటిని శాస్త్రీయ పర్యావరణ అనుకూలమైన పద్ధతిలో నిల్వ చేసి ప్రాసెస్ చేస్తే ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎటువంటి హాని జరగదు. సరైన యాజమాన్య నిర్వహణా పద్ధతిలో శుద్ధి చేయకపోతే మానవునికి, పర్యావరణానికి ఎంతో హాని కలిగిస్తాయి. ఉపయోగకరమైన భాగాలు లేదా పదార్థాన్ని తిరిగి పొందడానికి ప్రాసెసింగ్ కోసం అశాస్త్రీయ ముడి పద్ధతులను ఉపయోగిస్తే మానవాళికే కాకుండా పర్యావర ణానికి కూడా ముప్పు కలుగుతుంది. తగురీతిలో రీసైక్లింగ్ చేయకపోతే సీసం వంటి తెలిసిన న్యూరోటాక్సి కెంట్లతో సహా 1000వేర్వేరు రసాయన పదార్థాలను పర్యావరణంలోకి విడుదలవుతాయి.**

డి జె మోహన రావు

పంతొమ్మిది వందల నలభై ఎనిమిది సంవత్సరంలో ట్రాన్సిస్టర్ అనే చిన్న ఎలక్ట్రానిక్ పరికరాన్ని కనుగొన్న తరువాత ఎలక్ట్రానిక్స్ రంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ప్రతీ ఎలక్ట్రానిక్ పరికరంలో ప్రాసెసర్ అవసరం. ఇందులో లక్షల సంఖ్యలో ట్రాన్సిస్టర్లు ఉంటాయి.ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు మానవ జీవన విధానాన్ని సుఖమయం చేశాయి. అయితే వీటి జీవితకాలం కొంతవరకే ఉంటుంది. తరువాత వీటిని బయట పడేయవలసిందే. వేగవంతమైన సాంకేతిక పురోగతి కొత్త ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి కారణంగా పాతవి సులభంగా కొత్త మోడళ్లతో భర్తీ చేయబడుతున్నాయి. ఏదైనా ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాలు ఉద్దేశించబడిన ఉపయోగానికి అనర్హంగా మారినప్పుడు, దాని గడువు తేదీని దాటిన తరువాత వాటి ఉపయోగం ఉండదు. ఇటువంటి వాటిని ఎలక్ట్రానిక్ వ్యర్థాలు లేదా ఇవ్యర్థాలు అంటారు. గృహ వినోదపరికరాలు, స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్టాప్స్, స్మార్ట్ టివిలు, సర్వర్లు, మానిటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, జిరాక్స్ యంత్రాలు, డివిడిలు, బ్లూరేలు, రిమోట్లు, స్మార్ట్ వాచీలు, చార్జర్లు మొదలైన ఉపకరణాల నుండి ఇవ్యర్థాలు వస్తాయి. గ్లోబల్ ఈవేస్ట్ మానిటర్ 2024 ప్రకారం 2022లో ప్రపంచవ్యాప్తంగా 6.2 కోట్ల టన్నుల ఇవ్యర్థాలు ఉత్పత్తి చేయబడ్డాయి. సంవత్సరానికి తలసరి సగటున 7.8కిలోలకు సమానం. వీటిలో కేవలం 22.3 మాత్రమే అధికారికంగా సేకరించి రీసైకిల్ చేస్తున్నారు. 2010 నుండి 2022వరకు అధికారికంగా సేకరించి రీసైకిల్ చేయాల్సి న ఇవ్యర్థాల పరిమాణం 0.8కోట్లటన్నుల నుండి 1.38కోట్ల టన్నులకు పెరిగాయి. 2022లోయూరప్ అత్యధిక ఇవ్యర్థాలను (తలసరి 17.6 కిలోలు) ఉత్పత్తి చేసింది. వీటిలో అధికారికంగా 42.8 శాతాన్ని రీసైక్లింగ్ చేసింది.రీసైక్లింగ్ రేటు తలసరి 7.5కిలోలను కలిగి ఉంది. ఆఫ్రికా దేశాలలో ఈ రేటు ఒక శాతం కంటే తక్కువ ఇవ్యర్థాలను అధికారికంగా సేకరించి రీసైక్లింగ్ చేసింది.2030 నాటికి 8.2 కోట్ల టన్నులు ఇవ్యర్థాలు ఉత్పత్తి అవుతాయని అంచనా. సగటున ప్రతీ సంవత్సరం 25 లక్షల టన్నులు పెరుగుతున్నాయి. ఇవ్యర్థాలు సకల జీవరాసులతో సహా పర్యావరణానికి కూడా భారీప్రమాదాన్ని కలిగిస్తాయి. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఘన వ్యర్థాలలో ఇవి ఒకటి. వీటిలో విషపూరిత పదార్థాలు ఉండడం వలన వీటిని ప్రమాదకరమైన వ్యర్థాలుగా పరిగణిస్తారు. వీటిలో ప్లాస్టిక్, లోహాలు, కాథోడ్ రే ట్యూబ్స్, ప్రింటెడ్ కేబుల్స్, సర్క్యూట్ బోర్డులు ఉన్నాయి.రాగి, వెండి,బంగారం, ప్లాటినం వంటి విలువైన లోహాలు ఉంటాయి. శాస్త్రీయంగా ప్రాసెస్ చేసిన తర్వాత వీటిని తిరిగి పొందవచ్చు. లిక్విడ్ క్రిస్టల్, లిథియం, పాదరసం, నికెల్, సెలీనియం, పాలీక్లోరినేటెడ్ బైఫినైల్స్ (పిసిబి), ఆర్సెనిక్,బేరియం, బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్, కాడ్మియం, క్రోమ్, కోబాల్ట్, రాగి,సీసం వంటి విష పదార్థాలు ఉండటం చాలా ప్రమాదకరం. భారీ లోహాలు సూక్ష్మ పరిమాణంలో ఉండటం కూడా పర్యావరణానికి గణనీయమైన ముప్పును కలిగిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా అనధికారిక రీసైక్లింగ్ రంగంలో కోట్లమందిలో గర్భిణీలు,బాలకార్మికులు కూడా ఉంటున్నారని, వీరికి ఎక్కువ ప్రమాదం అని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ), అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ)ల నివేదికలు తెలుపుతున్నాయి. అనధికారిక ఇవ్యర్థాల రీసైక్లింగ్ అనేక ప్రతికూల ఆరోగ్య ప్రభావాలను చూపిస్తుంది. గర్భంలోని పిల్లల నుండి కౌమారదశలో ఉన్న పిల్లల వరకు వారికేంద్ర నాడీవ్యవస్థ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయి. ఇవ్యర్థాల నుండి కొన్ని హానికరమైన విషాలు ఊపిరితిత్తుల నిర్మాణ అభివృద్ధిని, పనితీరును ప్రభావితంచేస్తాయి. పిల్లల అభివృద్ధి చెందుతున్న వ్యవస్థలలో మార్పులు కోలుకోలేని హాని కలిగిస్తాయి. జీవితాంతం వారిని ప్రభావితం చేస్తాయి. లెడ్ (సీసం) మూత్రపిండాలు, నాడీ వ్యవస్థపై ప్రభావం చూపు



తుంది. చిన్నారుల ఎదుగుదలను అడ్డుకుటుంది. బేరియం మెదడు వ్యాపు వ్యాధికి దారితీస్తుంది. కణజాలాన్ని నాశనం చేస్తుంది. గుండె, కాలేయాన్ని దెబ్బతీస్తుంది. హెక్సావాలెంట్ క్రోమియం డిఎన్ఎ వ్యవస్థను నాశనం చేస్తుంది. ఫాస్పరస్ జ్ఞాపకశక్తిని నశింపజేస్తుది. బెరీలియం క్యాన్సర్‌వ్యాధికి దారితీస్తుందని ఇటీవలి పరిశోధనల్లో వెల్లడైంది. మెర్క్యురీ మెదడు, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. మహిళల్లో పిల్లల్నికనే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇవ్యర్థాలు వేడెక్కినప్పుడు అందులో ఉండే విషపూరిత రసాయనాలు వాతావరణంలోకి విడుదలవుతాయి. ఎలక్ట్రానిక్ వ్యర్థాలలో కనిపించే సీసం, జింక్, బేరియం మొదలైనవి మానవ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. అలాగే, ఇవ్యర్థాలు పల్లపు ప్రదేశాలను కలిసినప్పుడు, విషపూరిత రసాయనాలు నేల, నీటిలోకి ప్రవేశిస్తాయి. ఇది భూగర్భజల కాలుష్యానికి దారితీస్తుంది. ఇది మానవ ఆరోగ్యాన్ని మరింత ప్రభావితం చేస్తుంది. ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ పరికరాలు వాటి ఉపయోగకరమైన జీవితం తరువాత అవి ఇవ్యర్థాలుగా మారినప్పుడు వాటిని శాస్త్రీయ పర్యావరణ అనుకూలమైన పద్ధతిలో నిల్వ చేసి ప్రాసెస్ చేస్తే ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎటువంటి హాని జరగదు. సరైన యాజమాన్య నిర్వహణా పద్ధతిలో శుద్ధి చేయకపోతే మానవునికి, పర్యావరణానికి ఎంతో హాని కలిగిస్తాయి. ఉపయోగకరమైన భాగాలు లేదా పదార్థాన్ని తిరిగి పొందడానికి ప్రాసెసింగ్ కోసం అశాస్త్రీయ ముడి పద్ధతులను ఉపయోగిస్తే మానవాళికే కాకుండా పర్యావరణానికి కూడా ముప్పు కలుగుతుంది. తగురీతిలో రీసైక్లింగ్ చేయకపోతే సీసం వంటి తెలిసిన న్యూరోటాక్సి కెంట్లతో సహా 1000వేర్వేరు రసాయన పదార్థాలను పర్యావరణంలోకి విడుదలవుతాయి. ఒక దేశం నుంచి మరో దేశానికి ఇవ్యర్థాల రవాణాను నియంత్రించాలని అంతర్జాతీయ నిబంధనలున్నప్పటికీ తక్కువ మధ్య ఆదాయ దేశాలు (ఎల్ఎంఐసీ)లకు చట్టవిరుద్ధంగా రవాణా నిరంతరం కొనసాగుతోంది. భారత పర్యావరణ అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఇవేస్ట్ (మేనేజ్మెంట్) నిబంధనలు 2022ను తక్షణమే అమల్లోకి తీసుకురావడానికి 2024మార్చి 8న ఇవేస్ట్ (మేనేజ్మెంట్) సవరణ నిబంధనలు 2024ను తీసుకు వచ్చింది. అంతర్జాతీయంగా బాసెల్ కన్వెన్షన్ ప్రమాదకరవ్యర్థాల రవాణా వాటినిపారవేయడాన్ని నియంత్రిస్తుంది.ఇవ్యర్థాలు వాటి నిర్వహణతోసహా ప్రమాదకర వ్యర్థాల చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించిన సమగ్ర పర్యావరణ ఒప్పందం ఇది. 2019లో బాసెల్ కన్వెన్షన్ నిషేధ సవరణ అమల్లోకి వచ్చింది.ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్మెంట్ (ఒఇసిడి),యూరోపియన్ కమిషన్ దేశాలు, లైచెన్స్టెయిన్ దేశాలనుండి ఇవ్యర్థాలతో సహా ప్రమాదకరమైన వ్యర్థాలను కన్వెన్షన్లో భాగస్వామ్యమైన ఇతర దేశాలకు తరలించడాన్ని ఇది నిషేధిస్తుంది. బాసెల్ కన్వెన్షన్ ఇవ్యర్థాల పర్యావరణ పరంగా పటిష్టమైన నిర్వహణపై అభివృద్ధి చేయడానికి మార్గదర్శకత్వం అందించడానికి కార్యక్రమాలు వర్క్‌షాప్‌లను నిర్వహిస్తుంది. వ్యర్థాలు, వ్యర్థాలు కాని వాటి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడానికి, ఇవ్యర్థాల సరిహద్దుల కదలికను గుర్తించడానికి ఇది దేశాలకు మార్గదర్శకాలను అందిస్తుంది. యునైటెడ్ స్టేట్స్ చైనా తర్వాత భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఇవేస్ట్ ఉత్పత్తిదారుగా మన దేశంఉంది. భారతదేశం 2019లో 32 లక్షల టన్నుల ఇవ్యర్థాలను ఉత్పత్తిచేసింది.చైనా (ఒక కోటిటన్నులు),యునైటెడ్ స్టేట్స్ (69 లక్షల టన్నులు) ఉత్పత్తి చేసింది. 2018 19లో దేశంలో ఉత్పత్తి చేయబడిన ఈవ్యర్థాలలో కేవలం 10,2017-18లో ఉత్పత్తి చేయబడిన వాటిలో 3.5 మాత్రమే భారతదేశం సేకరించింది.ఫ్రాస్ట్‌సుల్లివన్ అంచనాల ప్రకారం భారతదేశంలో మొత్తం ఇవ్యర్థాల పరిమాణం 2025 నాటికి కనీసం ఒక కోటి టన్నులకు చేరుకుంటుందని అంచనా వేయబడింది. భారతదేశంలో దాదాపు 450 రిజిస్టర్డ్ ఇవేస్ట్ రీసైక్లర్లున్నాయి. ఇవేస్ట్ మేనేజ్మెంట్ రంగం 2025 వరకు ఆదాయంలో 14 వార్షిక వృద్ధి రేటుతో వృద్ధి చెందే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. మన దేశంలో ఒక సంవత్సరకాలంలో సుమారుగా కంప్యూటర్ పరికరాల నుండి70శాతం, స్మార్ట్‌ఫోన్లు ఇతర టెలికాం పరికరాల నుండి 12శాతం, విద్యుత్ పరికరాల నుండి7శాతం, వైద్యపరికరాల నుండి 8శాతం, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల నుండి 3శాతం ఇవ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి.ప్రతిసం॥ సుమారు 31 శాతం పెరుగుదల నమోదవుతుంది. మొదటి మూడు స్థానాలలో మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలున్నాయి.నగరాలలో ముంబాయి తొలిస్థానంలో,ఢిల్లీ, బెంగుళూర్లు రెండు, మూడు స్థానాలలో నిలుస్తున్నాయి. ●

# ప్రకృతి వ్యవసాయమే తప్పనిసరి కావాలి

సిద్ధగౌని సుదర్శన్

భారుగుతున్న జనాభాకు తగిన ఆహారపు అవసరాలను తీర్చడం కోసం వ్యవసాయంలో రసాయనిక మందులు ఎక్కువగా వాడుతున్నారు. వీటివల్ల పర్యావరణ కాలుష్యం అవుతుంది. మనిషి ఆరోగ్యం కూడా తీవ్రంగా దెబ్బతింటుంది. ఈసమస్యకు పరిష్కారం ప్రకృతి వ్యవసాయం. ప్రకృతి వ్యవసాయం అనేది సేంద్రియ పద్ధతుల ఆధారంగా వ్యవసాయం చేసే విధానం. ఇది భూమి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతుంది. వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం ప్రగతితో దూసుకుపోతున్నది. అయితే ఇది మనం లోతుగా గమనించినట్టయితే, తెలంగాణ ఏర్పడిన తర్వాత, వరి ఉత్పత్తి 2015-16 నుంచి 2021-2022 మధ్య కాలంలోనే 45.71 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 202 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. అంటే 342 శాతం పెరిగిందన్న మాట. ఈ అభివృద్ధి వెనుక ఒక పెద్ద కారణం రసాయనిక మందులు మీద విపరీతంగా ఆధారపడటమే. నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, న్యూఢిల్లీ (ఎన్ఏఏఎస్) నిర్వహించిన తాజా అధ్యయనం ప్రకారం స్టేట్ ఆఫ్ ఇండియన్ అగ్రికల్చర్ అనే రిపోర్టులో కెమికల్స్, పురుగుమందుల వాడకం ప్రమాదకర స్థాయిలో పెరిగి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం 3వ స్థానంలో ఉంది. ఇక్కడ ప్రతి హెక్టారుకు సుమారు 900కిలోల పురుగు మందులు వాడుతున్నారు. హర్యానా (హెక్టారుకు 1,100 కిలోలు),పంజాబ్ (హెక్టారుకు 1,250 కిలోలు) ఇంకా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే పంటలు పండించే రైతులకు, ఆహారాన్ని తీసుకునే ప్రజల ఆరోగ్యానికి భవిష్యత్తులో తీవ్రమైన ప్రమాదంగా మారుతుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఎన్ఏఏఎస్ తాజా అధ్యయనంప్రకారం, సహజ వ్యవసాయ విధానాలు భారతదేశంలోని రైతుల ఆర్థిక భద్రతను మెరుగుపరచడంలో గణనీయమైన మార్పులు తీసుకువస్తున్నాయి. ఇక్కడ కొన్ని గణాంకాలుచూస్తే



ప్రకృతి వ్యవసాయం వలన ఎరువులు,పురుగు మందులపై వ్యయం తగ్గిపోవడం ద్వారారైతుల ఆదాయంలో సుమారు 20-30శాతం పెరుగుదల జరుగుతుందని అధ్యయనంలో తేలింది.సహజ వ్యవసాయం ఉపయోగించే రైతులలో పంటల దిగుబడులు సుమారు 15-20శాతం పెరిగినట్లు నివేదిక తేల్చింది. ఇది సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పోలిస్తే మెరుగైన ఫలితాలను చూపిస్తున్నది. కొన్నిరాష్ట్రాల్లో, సహజ పద్ధతులు అవలంబించడం ద్వారా పురుగు మందుల వినియోగం సుమారు 50శాతం తగ్గినట్లు నివేదిక తెలియజేస్తోంది. ఇది పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను స్పష్టంగా తెలుపుతున్నది. టీడీఎఫ్ జైకిసాన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతివ్యవసాయన్ని ప్రోత్సహించడానికి మన విత్తనాలు, మన పంటలు మన ఆరోగ్యం అనే నినాదంతో నల్గొండజిల్లా మర్రిగూడమండల రైతులకు ప్రకృతి వ్యవసాయంపైన శిక్షణాశిబిరం నిర్వహించారు. విపరీతంగా రసాయనిక మందులు వాడటం వల్ల పంటలు పండించే రైతులకు, ఆహారాన్నితీసుకునే ప్రజల ఆరోగ్యానికి భవిష్యత్తులో తీవ్రమైన ప్రమాదంగా మారుతుం దని, వాటి నుంచి బయటపడి ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లే ప్రయత్నాలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 6 లక్షల మంది రైతులు జీరోబడ్జెట్ ప్రకృతి వ్యవసాయం విధానాన్ని అనుసరిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో సహజవ్యవసాయ రైతులసంఖ్య లక్షల్లో ఉండగా, తెలంగాణలో ప్రస్తుతం వివిధ ప్రాజెక్టుల కింద సహజ వ్యవసాయాన్ని స్వీకరించిన రైతుల సంఖ్య వేలల్లో మాత్రమేఉంది.రాష్ట్రంలో దీనిపైమరింత అవగాహన, ప్రోత్సాహంపెరిగితే, వచ్చే కొన్నేళ్లలోనే లక్షల సంఖ్యలో రైతులు సహజ వ్యవసాయం వైపుకు మళ్లేఅవకాశం ఉందని తెలంగాణ డెవప్‌మెంట్ ఫోరం సంస్థ భావిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో పురుగు మందుల వినియోగం తగ్గించడంపై దృష్టిసారిస్తూ,సేంద్రీయ, సహజమైన పద్ధతులపై రైతులను ప్రోత్సహించేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టింది. ●

# 'సబర్మతి' ఆదర్శంగా 'మూసీ' పునరుజ్జీవం

జయసూర్య

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, తెలంగాణాలో హైదరాబాద్ సమీపంలోని మూసీ పరీవాహక అభివృద్ధి, రెండు భారీ ప్రాజెక్టులుగా యిద్దరు ముఖ్యమంత్రులు లక్ష్య సాధనా కార్యాచరణలో నేడు ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అత్యవసరమైన రాజధాని నిర్మాణానికి, తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరం మధ్యలో ప్రవహిస్తున్న మూసీ ప్రవాహ ప్రక్షాళనకు సంబంధం లేని మాట నిజమే. కాని ఇద్దరు ముఖ్యమంత్రులు తమ ప్రభుత్వాలు సుసంపన్న ఆర్థిక సుస్థిరత, కొండంత ఆదాయ సమృద్ధి సాధించే భవిష్య భాగ్యోదయాన్ని అభిలషిస్తూ అడుగులు వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలే కాదు ప్రస్తుత భారతావనిలోని యించుమించు అన్ని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం, ఇబ్బడి ముబ్బడిగా ఆదాయాన్ని పెంచుకోవడానికి పర్యాటక రంగాన్ని పురావస్తు చారిత్రక ప్రాధాన్యత రంగంవైపు మలుపు తిప్పుతున్నాయి. ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, ఒడిషా యించుమించు అన్నిరాష్ట్రాలు ప్రాచీనపౌరాణిక క్షేత్రాల, నదీ నదాల ప్రాధాన్యత యాత్రికులను పర్యాటక విశేషంగా ఆకట్టు కొంటోంది. సర్దార్ పటేల్, బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్ వంటి మహనీయ, విస్మరించబడిన నేతలు ఎందరినో వెలుగులోకి తెచ్చే సత్కృషి కొనసాగుతోంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాధి నేతలు చారిత్రక ప్రాధాన్యతా ప్రాంతాలలో మహోన్నత నేతల శిలావిగ్రహాలను, గుజరాత్‌లో సర్దార్ పటేల్ నమూనాలో నెలకొల్పి, ఒకే దెబ్బలో రెండు పిట్టలుగా నాయకుల ఆరాధన, పర్యాటక ఆదాయం సమృద్ధిగా పొందగల ప్రాజెక్టులకు శ్రీకారం ప్రారభించారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన, బాపుఘాట్ రెండింటీ పునరుజ్జీవ పునర్వికాస లక్ష్యం చేపట్టింది. మహాత్మాగాంధీ భౌతిక అవశేషాలు కొన్ని పదిలపరచబడిన బాపుఘాట్, ఇంతవరకు విస్మరించబడి చారిత్రక పవిత్రత సంతరించుకున్న స్మృతిస్థలంగా వెలుగులోకి రావడం, భవిష్యత్‌పర్యాటక కేంద్రంగా అపురూప అత్యున్నత శిలా విగ్రహం ప్రతిష్ఠించే కార్యాచరణ సఫలం అయితే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ రాజకీయ పునరుజ్జీవ చర్య నిర్వర్తిం చినట్టే. ఉస్మాన్‌సాగర్ (మూసా)నుండి 11 కి.మీతో, హిమా యత్ సాగర్



(ఈసి)9.5 కిమీతో రెండు ప్రవాహాల వెంబడి 20.5 కి.మీలు ప్రాజెక్ట్ ప్రథమ దశతో బాపుఘాట్ 'వెజిటేరియన్' పర్యావరణ మిత్రత్వ కేంద్రంగా మహాత్ముని జీవితా దర్శాన్ని ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ నగరం ప్రతిబింబింప చేస్తుంది. అదేవిధంగా కుతుబ్ షాహీ స్మృతి స్థలాల నుండి లంగర్ హౌజ్ వరకు పర్యాటక ప్రాధాన్యత గల మహోన్నత చరిత్ర గల మహానగరం కావడంకారణంగా ప్రపంచ ప్రసిద్ధి పర్యాటక కేంద్రంగా ఆకట్టుకొంటుంది. ప్రకృతి వైపరీత్యాలలో ప్రధానంగా జల ప్రవాహాలవరదలు, కాలుష్య నదీ ప్రవాహాల కాలుష్యంతో భారత దేశంలోనే కాదు ప్రపంచంలోని మహానగరాలు అతలాకుతలం అవుతున్నాయి. మనదేశంలో విపరీత జనాభా కారణంగా త్రాగు నీరు స్వచ్ఛత కోల్పోయి మురికి నీటి కాలుష్యం, మురికి వాడలు విస్తరణ జనారోగ్యం మృత్యు బీభత్సంవైపు నడుస్తోంది. కోస్తాతీర రాష్ట్రాలైన తమిళనాడు. ఆంధ్రప్రదేశ్, వంటి రాష్ట్రాలు అతివృష్టి, అనావృష్టి, భూతాప విపరీత దుస్థితి కారణంగా మానవ మనుగడ ప్రమాద భరితమైంది. అమరావతి నగర నిర్మాతలకు, ఇటీవల బుడమేరు ఒక విషాద అనుభవాన్ని గుర్తుచేస్తోంది. నగరం మధ్యలో ప్రవహిస్తూ జనజీవన ఆరోగ్యాన్ని హరించే మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవం గురించి తప్పుపట్టవలసిన పనిలేదు. అదీగాక నగరాల మురికి నీటి జలాలు నదులలో కలపడం తప్ప మరో మార్గం లేకపోవడంతో, కృష్ణా,గోదావరి వంటి నదులలో కాలుష్యం మరింత చేరుతోంది.మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవ పథకం రాష్ట్ర ప్రభుత్వానికి పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం అందించే రూప కల్పన, హైదరాబాద్ నగర స్వరూప స్వభావాలను మార్చి వేయగలదనడంలో సందేహం లేదు. మూసీ పునరుజ్జీవ కార్యాచరణలో, ప్రభుత్వం ఇళ్లు కోల్పోయే నిర్వాసిత నిరుపేదల పునరావాస, పునరాశ్రయ పథకాలను సమగ్రంగా అందరికీ అమలుపరిచి బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి ప్రతి కంటి కన్నీరు తుడిచే తక్షణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పార్టీ రాజకీయాలతో సంబంధం లేని స్వచ్ఛమైన సామాజిక జన సంక్షేమానికి, నిరుపేదల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి వ్యవహరించాలి. మహాత్ముని జీవితాదర్శం అదే. ●

(రచయిత: సీనియర్ జర్నలిస్టు)

# రాష్ట్రస్థాయి క్రీడలన్నీ హుస్నాబాద్‌లోనే నిర్వహిస్తాం



విజేతలను బహుమతులు అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## క్రీడల్లో హుస్నాబాద్ రాష్ట్రంలోనే నం-1 కావాలి
## ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలి
## రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 10, ప్రభాతవార్త:** భవిష్యత్తులో రాష్ట్రస్థాయి క్రీడలన్ని హుస్నాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో 68వ అండర్ 14 బాయ్స్, గర్ల్స్ ఎస్‌జిఎఫ్ స్టేట్ లెవల్ హాండ్‌బాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గెలుపొందిన ఆదిలాబాద్, వరంగల్ బాలి కలు, కరీంనగర్, వరంగల్ బాలురకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ హుస్నాబాద్‌లో మొదటిసారి రాష్ట్రస్థాయి పోటీలు జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌లోని స్టేడియం విస్తీర్ణం పెంచుకుని రాబోయే కాలంలో అన్ని క్రీడలకు హుస్నా బాద్ వేదికగా మార్చుతామన్నారు. క్రీడలకు మంచి ప్రోత్సహకాలు అందించే విధంగా ప్రభుత్వం నుండి అని రకాల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల పియోల్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన తర్వాత స్ఫూర్తి పొంది యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరిం చారు. రాబోయో యూనివర్సిటీలో హుస్నాబాద్ నుండి అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందాలన్నారు. ఈ ప్రాంతంలో క్రీడలను పెంచేందుకు ప్రత్యేక శిక్షకుడిని నియమించామని వివిధ క్రీడల్లో వారు శిక్షణ ఇస్తున్నట్లు తెలి పారు.

**ఇంటింటి సర్వేకు ప్రజలందరూ సహకరించాలి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఉదయం సర్వే నిర్వహిస్తున్న ఇన్యూమరేటర్స్‌తో కలసి స్వయంగా వివరాలు నమోదు చేయించుకున్నారు. ప్రజలు ఈ సర్వే పట్ల ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని, ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు ఇంటింటికి తిరిగి అందరి వివరాలు నమోదు చేయించాలన్నారు.

**బంజారా భవన్‌కు రోడ్డు వేయండి**

హుస్నాబాద్ కేంద్రంలో ఎన్నోయేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బంజారా భవన్‌కి రోడ్డు వేసేందుకు స్థలపరిశీలన చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుకు ఆదేశించారు. గుట్టపై ఉన్న బంజారా భవన్‌వరకు ఇప్పటివరకు రోడ్డు వేయలేదని, రోడ్డు వేసేందుకు కావాల్సిన నిధులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయం వద్ద అనిమేని మండపం నిర్మాణాన్ని పరిశీలించారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం
# భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్
### రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్ (ముషీరాబాద్), నవంబరు 10, ప్రభాతవార్త:** విద్యార్థులు మంచి క్రమశిక్షణ కలిగి, సర్వతోముఖాభివృద్ధి చెందిన వారుగా తయారవ్వాలంటే అది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంతోనే సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ స్పష్టం చేశారు. ఆదివారం దోమలగూడలోని భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 వార్షికోత్సవ డైమండ్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ స్కౌట్స్ కూడా వసుధైక కుటుంబంలో మంచి పాత్రధారులను తయారుచేసే సంస్థగా ఉందని, ఇక్కడ నుండి వెళ్లిన విద్యార్థులు మామూలు డాక్టర్లుగా, ఇంజి నీర్లుగా కాకుండా మంచిడాక్టర్లుగా, నైపుణ్యత కలిగిన ఇంజనీర్లుగా తయార వుతారని అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సంద ర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో 75 సంవత్సరాలుగా పనిచేస్తున్న సీనియర్ సిటిజన్స్‌ను ఆయన సత్కరించారు. అనంతరం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చేసిన కార్యక్రమాలపై రూపొందించిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఛీఫ్ కమిషనర్ బుర్ర వెంకటేశం, భవాని శంకర్, రాజ్‌గోపాల్, సి.జె.అరుణ్‌కుమార్, జి.పరమేశ్వర్, జాన్ శామ్యూల్, స్కౌట్ మాస్టర్‌లు, గైడ్ కెప్టెన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ ఫ్రెండ్స్ విత్ బెనిఫిట్స్
### తెలంగాణ బిజెపి ట్వీట్

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఫ్రెండ్స్ విత్ బెనిఫిట్స్ అన్నట్లుగా సపోర్టు చేసుకుంటున్నాయని తెలంగాణ బిజెపి ట్వీట్ చేసింది. కెసిఆర్ గొర్రెల స్కామ్‌పై ట్విట్టర్ వేదికగా స్పందించారు. ట్రిప్పుకు 126 గొర్రెలను గుటుక్కుమన్న గొప్పోల్లు అని విమర్శలు చేసింది. దీనిపై లాలూ యాదవ్‌కు చెందిన అప్రసిద్ధ దాణా స్కామ్‌ను మరిచేలా చేయ గలిగింది ఎవరైనా ఉన్నారంటే, అది కల్వకుంట్ల గొర్రెల కుంభకోణమేనని ఆరోపించారు. ఈ లాజిస్టికల్ అద్భుతాన్ని వెలికి తీసినందుకు కాగ్‌కి ధన్య వాదాలు అని ప్రత్యేకంగా ట్వీట్టర్‌లో పేర్కొంది. ఇక లాజిక్ మరియు ఫిజిక్స్ రెండింటినీ ధిక్కరించి, సింగిల్‌ట్రిప్ ఇన్ వాయిస్‌లు సృష్టించవచ్చనే నమ్మ శక్యం కాని రవాణా సామర్థ్యాలను బహి ర్గతం చేయగలరని ఎవరు ఊహి స్తారని చెప్పింది. ఈ స్కాంలో అంబులెన్స్ 84 గొర్రెలను, ద్విచక్ర వాహనం 126 గొర్రెలను ధైర్యంగా లాగుతున్నదన్నంటూ ట్వీట్ చేశారు. అదేవిధంగా క్యాబ్ 168 గొర్రెలకు వసతి కల్పిస్తున్నదని, అదేవిధంగా ఆటోలో 126 గొర్రెలను ఎక్కించుకుని వెళ్తున్నదని బయటపడిందని ఎద్దేవా చేసింది. ఇంతలో ఫ్రెండ్స్ విత్ బెన్‌ఫిట్స్‌లా కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కవచం ఏర్పాటుచేసి, బయటపడేందుకు మార్గం చూపుతోందని తెలంగాణ బిజెపి తన ట్వీట్‌లో పేర్కొంది.

# కవ్వాలలో ఖనిజ నిక్షేపాలు
### విదేశీ బృందం పరిశోధన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 10:** తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల అభయారణ్యంలోని ఖనిజాలు, శిలల పరిశోధన కోసం స్లోవెకియా విద్యార్థుల బృందం ఆదివారం పర్యటించింది. కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన ప్రముఖ భూగోళ ఖనిజ,శిలల శాస్త్రవేత్త, డైరెక్టరు మంజుషా మహాజన్ ఆధ్వర్యంలో ఆ దేశ బృందం ఉదయం సఫారీ వాహనాల్లో అభయారణ్యంలోని గొండుగూడ, బైసన్‌కుంట, మల్యాలలోని వాచ్ టవరు పరిసర ప్రాంతాలకు వెళ్లింది. ఆయా ప్రాంతాల్లోని చెట్లు, గుట్ట లను, స్థానిక ప్రదేశాల్లోని ఖనిజాలు, శిలలను పరిశీలించారు. ఓ పెద్దచెట్టు అందాలను చూసి ఆ బృందం సభ్యులు ఎంతో మురిసిపోయారు. ఈ సంద ర్భంగా అడవుల అందాలనుచూసి వారందరూ సంతోషం వ్యక్తం చేశారు. వారి వెంట స్థానిక ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు నహీదపర్వీన్, ఎస్.శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులున్నారు.

# మనిషిని అంతర్ బహిర్గతంగా వికసింపజేసేదే నిజమైన విద్య
### అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త :** మనిషిని బహిర్గతంగా, అంతర్గతంగా వికసింపజేసేదే నిజమైన విద్య అని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ దేశ విద్యారంగ బలోపేతానికి ఆయన అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. చదువు బానిసత్వం నుంచి ఆత్మన్యూనత నుంచి మనిషిని విముక్తుడిని చేసి నిజమైన స్వేచ్ఛను ప్రసాదిస్తుందని అన్నారు. విద్య జీవనోపాధిని కలిగించేది మాత్రమే కాదనీ, జీవిత పరమార్థాన్ని వెలికితీసేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు తొలిరోజే యూనిఫాం, పుస్తకాల అంద జేత, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్ చార్జీలు, రెసి డెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు తెలంగాణ దర్శిని వంటి ఎన్నో కార్య క్రమాలను అమలు చేస్తూ విద్యారంగం ప్రగతి పట్ల నిబద్ధతతో పనిచే స్తున్నదని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పేర్కొన్నారు.

# కుల గణనలో వ్యక్తిగత వివరాల గోప్యత అవసరం
### అనవసర అంశాలను ప్రశ్నావళి నుంచి తొలగించాలి
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చేపడుతున్న కుల గణనలో వ్యక్తిగత వివరాల గోప్యత అవసరమని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అనవసరమైన అంశాలను ప్రశ్నావళి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంటింటి సర్వేలో భాగంగా సేకరిస్తున్న సమాచారంతో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. కుల గణన సర్వే మంచిదే అయినప్పటికీ కేవలం అందుకు సంబంధించిన అంశాలకే పరిమితమవ్వాలని సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు హెచ్చుమీరి కోట్ల రూపాయలను సైబర్ నేరస్థులు గల్లంతు చేస్తున్నారని... ఈ నేపథ్యంలో కులగణన సందర్భంగా సేకరిస్తున్న సెల్ నెంబర్లు, బ్యాంక్ ఖాతాలు, ఆధార్ కార్డు తదితర వివరాలు సైబర్ నేరగాళ్ళ చేతికి చిక్కితే ఇబ్బంది అవుతుందని.. అలా జరగకుండా పకడ్బంది చర్యలు తీసుకోవాలని కూనంనేని డిమాండ్ చేశారు. అవసరంలేని వివరాలను ఈ సర్వేలో సేకరిస్తున్నారని, కొన్ని చోట్ల ఏ పార్టీ అని కూడా అడుగుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వ్యక్తిగత గోప్యత పాటించాలని, వాటిని బహిర్గత పర్చాల్సిన అవసరం లేదని కోర్టులు చెప్పిన విషయాన్ని కూనంనేని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కుల గణనలో సేకరిస్తున్న ప్రశ్నల్లో కొన్ని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నదని, అవసరం లేని వాటిని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ అంశాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి స్పష్టతనివ్వాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## న్యూజీలాండ్‌లో మీట్ అండ్ గ్రీట్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 10:** న్యూజిలాండ్ తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆక్లాండ్ లో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా.వి నరసింహా చార్యులు పాల్గొన్నారు. మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని న్యూజిలాండ్ తెలం గాణ సెంట్రల్ అసోసియేషన్ నిర్వహించింది. స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్, అసెంబ్లీ కార్యదర్శిని శాలువా కప్పి, పుష్ప గుచ్ఛాలతో తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగిన 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (దిశిత) కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం స్టడీటూర్‌లో భాగంగా తెలంగాణ శాసనసభా బృందం న్యూజిలాండ్ చేరుకుంది.




# కెసిఆర్ చేసిన సర్వే ఏమైంది?
### సమగ్ర సర్వేపై బిజెపి వ్యతిరేకం కాదు..
### సర్కారు చిత్తశుద్ధిపై జనానికి నమ్మకం లేదు
### కేంద్రమంత్రి బండి సంజయ్



**భీమదేవరపల్లి నవంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కెసిఆర్ చేసిన సర్వే ఏమైందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ ప్రశ్నిం చారు. ఆదివారం రోజున భీమదేవరపల్లి మండలం రంగయ్య పల్లె గ్రామంలోని బిజెపి మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం పిడుగుపాటుకు ఇల్లు దగ్ధమైన ఎర్ర బోసు రాధిక పరామర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలోనే కెసిఆర్ చేసిన సమగ్ర సర్వే ప్రభుత్వానికి అందించాలని సర్వేకు ఖర్చయిన మొత్తాన్ని కేసీఆర్ దగ్గర ముక్కుపిండి వసూలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర సర్వేకు బిజెపి వ్యతిరేకం కాదని తెలంగాణ ప్రభుత్వం పైనే ప్రజలకు చిత్తశుద్ధి నమ్మకం లేదని అన్నారు. సమగ్ర కుల గణన సర్వే కోసం వెళ్తే ప్రజలు 6 గ్యారెంటీలపై వృద్ధులు పెన్షన్‌పై కళ్యాణ లక్ష్మీపై ప్రభుత్వం ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. వరి పంటపై ఇచ్చే బోనస్ ఎగ్గొట్టేందుకే కొనుగోలు కేంద్రాలని ఆలస్యంగా ప్రారంభిస్తున్నారని అన్నారు.

# 12న తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం

**హైదరాబాద్ (నాంపల్లి), నవంబరు 10 ప్రభాతవార్త :** సురవరం తెలుగు విశ్వ విద్యాలయం ప్రతీయేడాది తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు అందజేసే సాహితీ పురస్కారాలను 2022 సంవత్సరానికిగాను ప్రదానం చేయడం జరుగుతుందని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య వై.రెడ్డి శ్యామల తెలిపారు. ఈ మేరకు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ నెల 12వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2.30గంటల నుండి విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగే పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథిగా విశ్వ విద్యాలయ మాజీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు తదితరులతో కలిసి ఆయా ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలు శ్రీవరదాభ్యుదము పద్యకవితకు పెండ్యాల కిషన్‌శర్మకు; కాలం వాలిపోతున్నవైపు వచన కవితకు మెర్సీ మార్గరేట్; ఆటాపాటా బాలసాహిత్యంకు ఎన్నవెల్లి రాజమౌళి; నూనెసుక్క కథ/కథానికకు కొట్టం రామకృష్ణారెడ్డి; కెరటం నవలకు డా. తాళ్ళపల్లి యాకమ్మ; అనుభూతి అన్వేషణ సాహిత్య విమర్శకు ఆచార్య వెలుదండ నిత్యానందరావు; స్వాతంత్రోద్యమ వీరుల నాటకత్రయం నాటకంకు పి.ఎ.దేవి; వీరయ్య అనువాదంకు గురుమూర్తి గుబిలి; ఆజాద్‌హింద్‌ఫౌజ్ ముస్లిం పోరాటయోధులు వచనరచనకు సయ్యద్ నశీర్ అహమ్మద్; రంగంటే ఇష్టం ఉత్తమగ్రంథానికి డా. చాగంటి తులసి లను ఘనంగా సత్కరించి సాహితీ పురస్కారంతోపాటు ఒక్కొక్కరికి 20,116 రూపాయల నగదు అందజేస్తారని శ్యామల తెలిపారు.

సాధారణ పాఠకులతోపాటు కవులు, రచయితలు, విమర్శకులు, నాటకకర్తల నుండి సూచనలను స్వీకరించి 2019, 2020, 2021 సంవత్సరాల్లో ప్రచురించబడిన పుస్తకాలను సేకరించి న్యాయనిర్ణేతలతో వివిధ దశల్లో ఎంపిక కాబడిన ఉత్తమ సాహితీమూర్తులకు ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వివరించారు.

# గ్రూప్-3 హాల్‌టికెట్లు విడుదల
### పరీక్షలు జరిగే రోజు ఉదయం వరకు డౌన్‌లోడ్‌కు అవకాశం
### 17, 18 తేదీల్లో పరీక్షలు
### ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** ఆ రాష్ట్రంలో ఈ నెల 17, 18 తేదిల్లో నిర్వహించ నున్న గ్రూప్-3 పరీక్షలకి సంబంధించిన హాల్ టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసింది. గ్రూప్-3 హాల్ టికెట్లను ఈ నెల 10 నుంచి విడుదల చేస్తామని అక్టోబర్ 30న ప్రకటించిన టీజీపీఎస్సీ.. అన్నట్టుగా ఆదివారం(నవంబర్ 10) నుంచి హాల్ టికెట్లను అభ్యర్థులకి అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కమిషన్ ప్రకటించింది. తెలంగాణ గ్రూప్3 పరీక్షలు నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. రోజుకు రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నెల 17న.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్1.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్2 నిర్వహించనున్నారు. ఈ నెల 18న పేపర్3 పరీక్షను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1380 గ్రూప్3 పోస్టులకు నోటిఫికేషన్ నంబర్ 29/2022ను డిసెంబర్ 30, 2022న జారీ చేసింది. గ్రూప్-3 పోస్టుల కోసం రాష్ట్రంలో 5.36 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. పేపర్1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పేపర్2లో హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. ఇక పేపర్3లో ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో పేపరుకు 150 మార్కుల చొప్పున మొత్తం 450 మార్కులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

# భాషా పండితులందరికీ పదోన్నతులు కల్పించాలి
### ఉపాధ్యాయుల ప్రమోషన్లతో పాఠశాలలు శక్తివంతం
### ఆర్‌యుపిపిటికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి
### రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానం

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండితులందరికీ పదోన్న తులు కల్పించాలని రాష్ట్రీయ పండిత పరిషత్ తెలంగాణ(ఆర్‌యుపిపిటి) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తికి చేసింది. ఉపాధ్యాయుల ప్రమోషన్లతో రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు శక్తివంతమయ్యాయని సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతికృష్ణ తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు సంఘం నేతలు తెలిపారు. భాషా పండితులందరికీ పాఠశాల సహాయకులుగా ప్రమోషన్లు కల్పించడం వలన ఉన్నత పాఠశాలలు శక్తివంతం అయ్యాయని.. పిల్లలకు ఉపయోగపడే ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

లాంగ్వేజేస్‌ల్లో రాణిస్తే విద్యార్థులు జీవితంలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకొని ఉన్నత స్థానాలకు చేరుకుంటారని అన్నారు. విద్యార్థులలో ఈ శక్తిని పెంచడానికి ప్రతి ప్రాథమిక పాఠశాలలోనూ భాషను బోధించే ప్రత్యేక ఉపాధ్యాయున్ని నియమించాలని కోరారు. రాష్ట్రంలో మిగిలి పోయిన భాషా పండితులందరికీ తెలుగు, హిందీ, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులలో ప్రమోషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒక తెలుగు, ఒక హిందీ ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని... 1/2005 చట్టాన్ని రద్దుచేసి పండితులకు నోషనల్‌గా సీనియార్టీ అర్హత కల్పించాలి. తెలు గు, హిందీ, ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ల పక్షాన నిజాయితీగా, నిర్భీతిగా సంఘం పోరాడుతోందని తెలిపారు. 1927 లో ఏర్పడిన ఆర్‌యుపిపిటికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కోరారు.

## నేడు చౌటుప్పల్ వ్యవసాయ కమిటీ కేంద్రంలో
# బిజెపి ఎంపి లక్ష్మణ్ పర్యటన

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించేందుకు సోమవారం ఉదయం 11 గంటలకు నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీతో పాటు జైకేసారం గ్రామాలలో బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు పార్లమెంట్ సభ్యులు డాక్టర్. కె.లక్ష్మణ్ పర్యటిం చనున్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియ జేసేందుకు ఈ పర్యటన చేస్తున్నట్లు తెలిపారు.

# లండన్‌లో హైదరాబాద్ యువతికి రోడ్డు ప్రమాదం.. తీవ్రగాయాలు
### ప్రాణాపాయస్థితిలో ఉన్న బాధితురాలికి ఆస్పత్రిలో చికిత్స

**హైదరాబాద్ (ఎల్‌బినగర్), నవంబరు 10, ప్రభాతవార్త:** యుకెలోని లండన్‌లో హిమబిందు అనే హైదరాబాద్ యువతి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా పడింది. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్యం విషమంగానే ఉంది. వివరాల్లోకి వెళితే.. అయిదు నెలల క్రితం లండన్ లోని ప్రెస్టన్ నగరానికివెళ్లిన నగరంలోని చైతన్యపురికి చెందిన హిమబిందు లండన్‌లోని బ్రోక్ హెవెన్ అనే ఆస్పత్రిలో కేర్‌టేకర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. కాగా హిమ బిందు గత నెల 24న రోడ్డు దాటుతుండగా అతివేగంగా దూసుకు వచ్చిన కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో కోమాలోకి వెళ్లారు. ఆస్ప త్రికి తరలించినట్లు లండన్ పోలీ సులు తెలిపారు. ప్రమాద కారకుడైన ట్రక్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని డ్రగ్ మత్తులో అతివేగంగా డ్రైవింగ్ చేశాడని పోలీసులు నిర్ధారణ చేశారు. ఈ విషయాన్ని హైదరాబాద్ చైతన్యపురిలో ఉంటున్న యువతి తల్లికి లండన్‌లోని బంధువులు సమాచారం అందించారు. 16 రోజులుగా ఆం దోళన చెందుతున్న తల్లి వెంకటరమణమ్మ తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ప్రభుత్వం తమ కూతురు వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా లండన్ వెళ్లేందుకు సాయం అందించాలని బాధితురాలి తల్లి వెంకట రమణమ్మ మీడియా ద్వారా ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.


హిమబిందు (ఫైల్)

# హైడ్రా అమలులో అడ్డంకులు సర్వసాధారణం.. వ్యవస్థను తప్పబట్టడం సరికాదు
### హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** హైడ్రా వ్యవస్థ ద్వారా భూకబ్జాలు, చెరువుల కబ్జాలు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రక్షాళన చేస్తున్న సమ యంలో ఎన్నో ఆటుపాట్లు ఎదురవవడం సర్వసాధా రణమని, కానీ ఈ వ్యవస్థనే తప్పుబట్టడం మంచి కాదని ఆ శాఖ కమీషనర్ ఎ.వి.రంగనాథ్ అన్నారు. ఆదివారం నగరంలోని అశోక్‌నగర్‌లోని సిఎస్‌బి ఐఏఎస్ అకాడమిలో అకాడమి, టైలరో సంయుక్త ఆధ్వర్యంలో ప్రాజెక్టు కల్పతరు-3 పేరుతో ప్రతిభ కనబర్చిన 10 మందికి ఉచిత శిక్షణ, టాప్-200లో వచ్చిన వారికి సివిల్స్ మెటీరియల్స్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎ.వి.రంగనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ధైర్యంతో హైడ్రాను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇటీవల తాను బెంగుళూరుకు వెళ్లిన సందర్భంలో అక్కడి ప్రముఖులు ఈ అంశాన్ని ప్రస్తావించారని, ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగు తోందని, సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో హైడ్రా ఏర్పాటు చేసి తనపై ఎంతో బాధ్యతను పెట్టారని అన్నారు. ప్రధానంగా హైడ్రా ద్వారా కబ్జాలలో ప్రభుత్వ భూములను ఇతర వాటిని స్వాధీనం పరిచే కార్యక్రమాన్ని పకడ్భంధీగా అమలు చేస్తున్నా మన్నారు. హైడ్రా ద్వారా మార్పు దిశగా తీసుకెళ్తున్నా మన్నారు. 20 సంవత్సరాల కింద అశోక్‌నగర్ రోడ్లపై తిరుగుతూ సివిల్‌సర్వీసెస్ కోసం కోచింగ్ తీసుకున్న వారిలో తాను ఒకడినని, వివిధ సబ్జెక్స్‌లపై మాట్లాడుకునే వాళ్లమని, చదువుకునే వాళ్లమని, అశోక్‌నగర్ ప్రాంతం కోచింగ్‌కు ఎంతో ప్రసిద్ధి అని అన్నారు. సిబిఎస్ అకాడమి అధినేత్రి బాలలత తనకున్న వైకల్యాన్ని అధిగమించి ఎంతో మందిని ఐఎఎస్, ఐపీఎస్‌లుగా తీర్చిదిద్ది దేశానికి గొప్ప అధికారులను అందించారన్నారు. అంగవైకల్యం శరీరానికి కాదని, దానిని అధిగమించి లక్ష్యం వైపు ముందుకు సాగడం స్ఫూర్తిదాయకంగా నిలు స్తుందన్నారు. ఆమె ఎక్కడ కూడా కాంప్రమైజ్ కాకుండా ముందుకు సాగుతోందన్నారు. బాలలత మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతను ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. కల్పతరు స్కాలర్ షిప్ పరీక్షకు పదివేల మందికిపైగా యువతీ యువకులు దరఖాస్తు చేయగా సుమారు నాలుగువేల మందికిపైగా హాజరవడం ఇందులో పది మందికి తమ అకాడమి ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు వివ రించారు. కార్యక్రమంలో టైలరో సిఇఒ జె.ఐశ్వర్య, సెట్విన్ ఎండి కె.వేణు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు కల్పతరు-3 పేరుతో బహుమతులు అందిస్తున్న హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, చిత్రంలో సిఎస్‌బి అకాడమి అధినేత్రి బాలలత, సెట్విన్ ఎండి కె.వేణుగోపాలరావు, టైలరో సిఇఒ జె.ఐశ్వర్య.




# నేటినుంచి ఏపి అసెంబ్లీ

## వార్షిక బడ్జెట్ సమర్పించనున్న ప్రభుత్వం

## సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు వైసిపి వెల్లడి

**విజయవాడ నవంబరు10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. నాలుగు నెలల క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వం మొదటిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ప్రస్తుత ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్ నవంబరు చివరితో ముగియనుండడంతో అసెంబ్లీ సమావేశాల తొలిరేజే పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష వైసీపీ హాజరుకావటం లేదు. కూటమి ప్రభుత్వంలోని టిడిపి, బిజెపి, జనసేన పార్టీలే హాజరుకానున్నాయి. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు మాజీ సిఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రకటించారు.

తన నివాసం నుంచే మీడియా ద్వారానే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. తనకు అసెంబ్లీలో మాట్లాడ టానికి ఎక్కువ సమయం మైక్ ఇవ్వాల్సి వస్తుందేమోననే ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని జగన్ పేర్కొన్నారు. అసెంబ్లీ కంటే ముందు సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరం మిగిలి ఉన్న కాలానికి బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలపనుంది. బిఎసి అనంతరం అసెంబ్లీ సమావేశం జరగనుంది. బిఎసిలో అసెంబ్లీ నిర్వహణ, మినిట్స్‌పై నిర్ణయం తీసుకోనున్నారు. అసెంబ్లీ సమావేశాలలో ముందుగా గవర్నర్ ప్రసంగిస్తారు. ఆపై అసెంబ్లీలో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. అనంతరం అసెంబ్లీ వాయిదా పడుతుంది. రెండు రోజుల తర్వాత మళ్లీ ఏపి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఏపి ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం రాష్ట్ర గవర్నర్‌ను కలిసి బడ్జెట్‌కు సంబంధించిన ఏజెండా అంశాలను వివరించారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ శాసనమండలి సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలను అసెంబ్లీ మీడియా పాయింట్ నుండి మీడియా వీక్షించే విధంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆ శాఖ జెడి సూర్యచంద్రరావు తెలిపారు. అసెంబ్లీ నుండి పాసు పొందిన మీడియా ప్రతినిధులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాల్సిందిగా విజ్ఞప్తిచేసారు.

# ఇప్పటిదాకా ఏడు లక్షలమంది రష్యా సైనికులు మృతి

## బ్రిటన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ వెల్లడి

**లండన్, నవంబరు 10:** రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభం అయి సుమారు మూడేళ్లుపూర్తికావస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం షురూచేసినప్పటినుంచి అత్యంత దారుణమైన ప్రతిఘటనను అక్టోబరులో రష్యాబలగాలు చవిచూసాయని బ్రిటన్‌సాయుధ దళాల అధిపతి వెల్లడించారు. అక్టోబరులో రెఓజుకు సగటున 1500 మంది రష్యన్‌సైనికులు మరణించడం లేదా తీవ్రంగా గాయపడటం జరిగిందని బ్రిటన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్‌స్టాఫ్ టోనీ రాడాకిన్ వెల్లడించారు. రష్యా యుద్ధంలో మరణించిన తమ సైనికుల సంఖ్యను బయటికి చెప్పడం లేదని ఫిబ్రవరి 2022లో రష్యా ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దండయాత్రను ప్రారంభించినప్పటినుంచి గతనెలలో అత్యధికంగా సైనికులను కోల్పోయిందని వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆశయం కారణంగా సుమారు ఏడు లక్షల మంది రష్యా సైనికులు ప్రాణత్యాగాలు చేసారన్నారు. చాలా తక్కువ భూభాగంకోసంఅధిక సైన్యాన్ని నష్టపోయిందని, రష్యా ప్రభుత్వం, రక్షణ భద్రతపై ప్రజావ్యయంలో 40శాతానికిపైగా ఖర్చుచేస్తోందని బ్రిటన్ అధికారి వెల్లడించారు. ఇపుడు పుతిన్ దేశంపై అధికభారం వేసారని, ఉక్రెయిన్‌కు బ్రిటన్ మద్దతిస్తూనే ఉంటుందని అది అధ్యక్షుడు పుతిన్ గ్రహించుకోవాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మా భరోసా ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. రష్యా దురా క్రమణకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో ఉక్రెయిన్‌కు మద్దతు దారుల్లో బ్రిటన్‌కూడా ఒకటి. ఉక్రెయిన్‌కు బిలియన్లకొద్దీ పౌండ్లతో సైనిక సాయంతోపాటు ఆయుధాలు, బల గాలకు శిక్షణను అందిస్తోంది. అమెరికాలో డొనాల్డ్‌ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఉక్రెయిన్ యుద్ధప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి పాశ్చాత్య దేశాల భవిష్యత్తు నిబద్ధత గురించి ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో బ్రిటన్



ప్రధానమంత్రి కైర్‌స్టార్మర్ ఉక్రెయిన్‌కు మరోసారి తన మద్దతును స్పష్టంచేసారు.

# అమరావతి నిర్మాణ నిధులకు కేంద్రం ఆమోదం

**విజయవాడ,నవంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని నిర్మాణ నిధులపై కీలక పరిణామం చోటు చేసుకుంది. సిఆర్‌డిఎ రాజధాని అమరావతి నిర్మాణ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రపంచ బ్యాంకు, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా 15 వేల కోట్ల రూపాయల మేర రుణ సహకారాన్ని అందించనున్నట్లు స్పష్టంచేసింది. అమరావతి అభి వృద్ధి ప్రణాళిక అమలుచేయాలని, ఈ నిధులతో రాజధాని అమరావతిలో అత్యున్నత ప్రమాణాలతో మౌలిక వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండేలా కార్యాచరణ చేపట్టా లని స్పష్టం చేసింది. ప్రజా రాజధానిగా అమరావతి అభివృద్ధికి చేపట్టా ల్సిన ప్రణాళికలు అమలు చేయాలని సిఆర్‌డిఎను ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ప్రధాన రహదా రులు, డక్ట్‌లు, డ్రెయిన్‌లు, వరద నీటి ప్రవాహానికి అనుగుణంగా కాలువలు, నీటి రిజర్వాయర్‌లు, సురక్షిత తాగునీరులాంటి సదుపాయాలకు సంబం ధించిన ప్రాజెక్టులు చేపట్టాలని ఆదేశించారు. రాజ ధాని అమరావతి నగరం సుస్థిరాభివృద్ధి, నగర నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులు ఇచ్చే నిధుల వినియోగంపై ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా 15 వేల కోట్ల రూపాయల మేర రుణ సహకారాన్ని అందించనున్నట్లు స్పష్టంచేసింది.

**సిఆర్‌డిఎ ప్రతిపాదనలకు ఆమోదం:** అమరావతి రాజధాని సుస్థిర అభివృద్ధికి సిఆర్‌డిఎ సమర్పించిన పతిపాదనలు ఇచ్చారు. కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదించిందని వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులు కూడా ఆమోదం తెలిపి అమరావతి నగర నిర్మాణం అభివృద్ధికి చెరో 800 మిలియన్ డాలర్ల మేర ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చినట్టు వెల్లడించారు.

మిగతా నిధులను కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకుంటుందని స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం పొందేందుకు ఏపి సిఆర్‌డిఎ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

**అభివృద్ధి, నిర్మాణ ప్రణాళికలు సిఆర్‌డిఎ కమిషనర్ వద్దే:** అభివృద్ధి, నిర్మాణ ప్రణాళికల ఆధారంగా దశల వారీగా బ్యాంకుల నుంచి నిధులు పొందేందుకు ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రణాళికల కోసం బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులతో పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. సిఆర్‌డిఎ కమిషనర్ అధీనంలోనే ఈ అభివృద్ధి, నిర్మాణ ప్రణాళికలు అమలు చేయనున్నట్టు స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం, మంగళవారం ఢిల్లీలో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి రుణ సహకారంపై సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఒప్పందం కుదుర్చుకోనున్నారు. ఇప్పటికే ఎడిబి ఇచ్చే నిధుల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ ఉత్తర్వుల్లో సీఆర్‌డీఏ ప్రతిపాదనలను కేంద్ర ఆర్థికశాఖ ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి చేసింది.అందుకు అనుగుణంగా ఇప్పుడు రాజధాని అమరావతి నగరం సుస్థిరాభివృద్ధి, నగర నిర్మాణం కోసంపై ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

# అభివృద్ధి, సౌకర్యాల కల్పనపైనే తొలి ప్రాధాన్యత

## 18న టిటిడి ధర్మకర్తల మండలి తొలి సమావేశం

**తిరుమల,నవంబరు 10ప్రభాతవార్తప్రతినిధి:** దేవదే వుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణ, పాలన వ్యవహారాలు పర్యవేక్షణకు నియామకమైన తిరుమల తిరుపతి దేవస్థానం నూతన ధర్మకర్తలమండలి తొలిసమావేశం ఈనెల 18వతేదీ తిరుమలలో జరగనుంది. తిరు మల పవిత్రతను కాపాడటం, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, పలు అభివృద్ధికి సంబంధించి ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన టిటిడి బోర్డు ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో కీలక నిర్ణ యాలు తీసుకోనున్నారు. ఇదేగాక తిరుమల తిరుపతిదేవస్థానం ఉద్యోగుల సంక్షేమం, ఇళ్లస్థ లాల అంశం , డిసెంబర్ 31వతేదీ అర్ధరాత్రి 2025 నూతన ఆంగ్లసంవత్సరం ఆరంభం దర్శనాలు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ప్రధానంగా సామాన్యభక్తులకు దర్శనం మరింత సౌలభ్యం చేసే అంశం, శాశ్వతతాగు నీటి సమస్య పరిష్కారం, స్వతహాగా నెయ్యి తయారీ వంటి అంశాలపై చర్చించ నున్నారు. గత ఐదేళ్ళ టిటిడి ధర్మకర్తల మండలిలో కల్తీ నెయ్యిఘటన, ఇంజనీరింగ్ నిధులు పక్కదారి పట్టించడం, దుబారా చేయడం వంటి వాటిపై దృష్టి సారించి చర్చించే అవకాశం ఉంది. మరీ ఛైర్మన్ బిఆర్‌నాయుడు నేతృత్వంలో జరగనున్న తొలిసమావేశంలో ఎలాంటి నిర్ణయాలకు ప్రాధా న్యత ఉంటుందనేది చూడాల్సిందే.

ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాయుడు తన తొలి ప్రసంగంలోనే తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడుకోవడమే తమ ముందున్న లక్ష్యమని, అందుకు తగ్గట్లు తిరుమల తిరుపతి దేవస్థానం నూతన ధర్మకర్తలమండలి ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. సామాన్యభక్తులకు మరింత సౌకర్యవంతంగా స్వామివారి దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తామని అన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే కొలువు దీరిన నూతన బోర్డులో సభ్యులకు దర్శనాలకు సంబంధించి కోటా కూడా వెల్లడైంది. ప్రతిరోజూ సోమవారం నుండి గురువారం వరకు ఒక్కో బోర్డు సభ్యునికి 20 విఐపి బ్రేక్ దర్శనాల టిక్కెట్లు, 300 రూపాయలు సుపథం దర్శనాలు 20 టిక్కెట్లు, వారంలో సుప్రభాతం 4 టిక్కెట్లు, కల్యా ణోత్సవం వారంలో 4టిక్కెట్లు, తోమాల,అర్చన సేవలు వారంలో 2 టిక్కె ట్లు ఇలా కేటాయిం చేలా ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి నాలుగు నెలలకోసారి రెండు అభిషేకసేవ టిక్కెట్లు కూడా మంజూరుచేసేలానిర్ణయం తీసుకున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు కొత్త రైల్వే ప్రధాన వైద్యాధికారి

**గుంతకల్లు రైల్వే,నవంబరు 10,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రధాన వైద్యాధికారిణి(పిసియండి) గా ఇండియన్ రైల్వే హెల్త్ సర్వీసు క్యాడర్‌కు చెందిన డాక్టర్ నిర్మలా నరసింహన్‌ను నియమిస్తూ రైల్వే బోర్డు ఎస్టాబ్లిష్మెంట్ ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ సికె వెంకటేశ్వర్లు ఈ నెల 23న పదవీ విరమణ చేస్తున్నారు. దీంతో ఆయన స్థానంలో సదరన్ రైల్వే పిసిఎండిగా పనిచేస్తున్న నిర్మలా నరసిం హన్‌ను రైల్వే బోర్డు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ సిఎండిగా నియమించింది. కాగా డాక్టర్ నిర్మలా నరసింహన్ స్థానంలో ప్రస్తుతం సదరన్ రైల్వేలో పనిచేస్తున్న డాక్టర్ రంగనాథన్ కళ్యాణి మునుస్వామి(యస్ కళ్యాణి)ని సదరన్ రైల్వే సిపిఎండిగా నియమించినట్లు ఆయన తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

# కిష్త్వార్ ఎన్‌కౌంటర్‌లో ఆర్మీ అధికారి మృతి

## మరో ముగ్గురు జవాన్లకు తీవ్రగాయాలు

**శ్రీనగర్, నవంబరు 10:** జమ్ముకాశ్మీర్‌లోజరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక ఆర్మీ అధికారి చనిపోగా మరో ముగ్గురు జవాన్లు తీవ్ర గాయాలపాలయ్యారు. జమ్ముకాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో జరిగినీ ఘటనలో హోరాహోరీ కాల్పు లు జరిగాయి. మారుమూల అటవీప్రాంతంలో ఉగ్రవాదులు, ఆర్మీ జవాన్లమధ్య కాల్పులుజరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు పారా ఫోర్సెస్‌కు చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి నాయబ్ సుబేదార్ రాకేష్‌కుమార్‌మరణించారని ఆర్మీ వైట్‌నైట్‌కార్ప్స్ తెలిపింది. మరో ముగ్గురు కమాండోలు గాయపడ్డారు. కిష్త్వార్‌లో చేపట్టిన మిలిటరీ ఆపరేషన్‌లోభాగంగానే నాయ్‌సుబేదార్ రాకేష్‌కుమార్ ఎంతోధైర్యంతో ఉగ్రవాదులతో పోరాడి అమరుడయ్యాడని జనరల్ ఆఫీసర్ కమాండింగ్ వెల్లడించింది. ఈ శోక సమయంలో ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని ప్రకటించారు. అలాగే ఇద్దరు విలేజ్ డిఫెన్స్ గార్డులు అయిననజీర్ అహ్మద్; కుల్దీప్‌కుమార్‌లనుకూడా ఉగ్రవాదులు కాల్చి చంపారు. దీనితో జమ్ముకాశ్మీర్ పోలీసులు ఆర్మీ సంయుక్తంగా కిష్తావర్ అడవుల్లో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. అక్కడ నక్కి ఉన్న ఉగ్రవాదులు వారిపై కాల్పులుజరపడంతో ఎదురుకాల్పులుజరిపారు. ఇప్పటికీ ఎన్‌కౌంటర్ కొనసాగుతూనే ఉందని ఆర్మీ అధికారులు తెలిపారు.

# మహారాష్ట్ర ప్రజలకు బిజెపి, కాంగ్రెస్ భారీ వరాలు




## యువతకు 25లక్షల ఉద్యోగాలు

### రైతులు చెల్లించిన జిఎస్టీ తిరిగి వాపసు

### 50 లక్షలమంది మహిళలకు లఖ్‌పతీ దీదీ వర్తింపు

### మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి మేనిఫెస్టో విడుదల

**ముంబయి, నవంబరు 10:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బిజెపి తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదలచేసింది. మహాయుతి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని కులాలు వర్గాలకు సమానప్రాతినిధ్యం కల్పిస్తామని అన్నారు. రాష్ట్రాన్ని వికసిత్‌మహారాష్ట్రగా మార్చేందుకు రోడ్‌మ్యాప్ రూపొందించామని ఉపముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవిస్ తెలిపారు. యువతకు 25 లక్షల ఉద్యోగాలు, రాష్ట్రంలో మరింతగా ఉపాధి సృష్టికోసం ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాల డిమాండ్ సరఫరాను అంచనా వేసేందుకు నైపుణ్య గణన. 11 లక్షలమంది మహిళలకు ప్రయోజనం చేకూరుస్తున్న లఖ్‌పతి దీదీపథకం 50 లక్షలమందికి వర్తింపచేస్తామని ప్రకటిం చారు. రైతులు ఎఉరువులపై చెల్లించినజీఎస్టీని తిరిగి చెల్లించి ఆర్థికభారం తగ్గిస్తామని, పారిశ్రామిక అభివృద్ధిని పెంచేందుకు ప్రభుత్వంనుంచి రూ.25 లక్షలవరకూ వడ్డీలేని రుణాలు,రైతులకు రుణమాఫీచేసి వారిపై రుణభారం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వృద్ధులకు అందించే నెలవారీ పెన్షన్‌ను రూ.1500 నుంచి 2100కు పెంచడం నిత్యావసర వస్తువులధరలను స్థిరంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు పదిరోజులు మాత్రమే గడువున్ననేపథ్యంలో బిజెపి తన మేనిఫెస్టోను ప్రకటించింది. సంకల్ప్‌పత్ర పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విడుదలచేసారు. మేనిఫెస్టో రాష్ట్రప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందన్నారు. యువకులు, పేదలు, రైతులు, మహిళలు అభివృద్ధికోసం అనేక పథకాలున్నాయన్నారు. నైపుణ్యగణన, స్టార్టప్‌ల అభివృద్ధికోసం శివాజీమహారాజ్ కేంద్రం, ఇంక్యుబేషన్‌సెంటర్లు, వడ్డీలేని రుణాలు అందిస్తామని తెలిపారు.మహారాష్ట్రలో సుస్థిరమైన విశ్వసనీయమైన పరిపాలన ఉండాలంటే మహాయుతి ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు.



## రూ.3 లక్షల వ్యవసాయ రుణ మాఫీ

### రుణాలు చెల్లించిన రైతులకు రూ.50వేల సాయం

### మహారాష్ట్రలో ఎంవిఎ కూటమి ఎన్నికల మేనిఫెస్టో

**ముంబయి, నవంబరు 10:** మహారాష్ట్ర ఎన్నికలకు తేదీలు దగ్గరపడుతున్నకొద్దీ రాష్ట్రప్రజలపై ప్రధాన పార్టీలు హామీలు కురిపిస్తున్నాయి. ఈక్రమంలోనే మహావికాస్ అఘాడి మ్యానిఫెస్టోను విడుదలచేసింది. ప్రధానంగా కులగణన రిజర్వేషన్ల వ్యవసాయం పట్టణ గ్రామీణాభివృద్ధి ఆరోగ్యంపై దృష్టిసారించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే మాట్లాడారు. ఎంవిఎ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో కులగణను నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న 50శాతం రిజర్వేషన్లను మరింతపెంచుతామని, అందుకు కూటమిలో చర్చలు జరుగుతున్నాయని ప్రకటించింది.

కులగణన అంతే సమాజాన్ని వేరుచేయడం కాదని, వివిధ వర్గాలకు మరింతప్రయోజనం కలిగించేందుకు ఈ గణన దోహదంచేస్తుందని, కులగణన, రిజర్వేషన్లు,వ్యవసాయం, పట్టణగ్రామీణాభివృద్ధి, ఆరోగ్య హామీలతో కూడిన మేనిఫెస్టోను మీ ముందు ఉంచామన్నారు. ఈ హామీలు కుటుంబాల అభ్యున్నతికి దోహదపడతాయని, ఏడాదికిసుమారు రూ.3.5 లక్షలనుంచి సామాన్యులకు ఉపశమనంలభిస్తుందని ఖర్గే అన్నారు. రాజస్థాన్‌లో అమలవుతున్న రూ.25 లక్షల ఆరోగ్యబీమాను మహారాష్ట్రలోనూ ప్రారంభించనున్నారు. రూ.3 లక్షల వనయవసాయ రుణమాఫీ అమలుచేస్తామని అన్నారు. రుణాలను తిరిగి చెల్లించే రైతులకు రూ.50వేల సాయం చేస్తామన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన నిరుద్యోగులకు నెలకు రూ.4 వేలు అందచేస్తామని ఎంవిఎ కూటమి ప్రకటించింది.

# ప్రేమ వివాహానికి అడ్డొస్తున్నాడని ప్రియురాలి తండ్రిపై కాల్పులు

## సరూర్‌నగర్‌లో కలకలం



నిందితుడు బల్వీర్

**హైదరాబాద్ (హుడా కాంప్లెక్స్), నవంబరు 10, ప్రభాతవార్త:** తన ప్రేమకు అడ్డుగా ఉన్నాడని అమ్మాయి తండ్రిని ప్రేమికుడు ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపిన ఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనతో ప్రియురాలి తండ్రి కుడి కన్నుకు తీవ్ర గాయమై ఆసుపత్రి పాలైన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ సైదిరెడ్డి కథనం ప్రకారం. సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీకి చెందిన పెరిశెట్టి రేణుక ఆనంద్‌కు ఇద్దరు పిల్లలు. చిన్న కుమార్తె ఉన్నతి వికాస్ భారతి స్కూల్లో 7వ తరగతి చదువుంది. స్కూల్లో చదువే రోజుల్లో తన క్లాస్ మేట్ గోగికర్ బల్వీర్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి గోగికర్ బల్వీర్ తన కూతురిని ప్రేమిస్తున్నానని వేదించేవాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం కూడా బల్వీర్ తన స్నేహితుడు గోపికి ఫోన్ చేసి రేణుక ఆనంద్ మాప్రేమకు అడ్డుగా వస్తున్నాడని అతనిని చంపేస్తానని ఫోన్ ద్వార చెప్పాడు. కొన్ని రోజుల తరువాత అమ్మాయి ఉండే అపార్ట్‌మెంట్‌కు వెళ్లి నీకూతుర్ని ప్రేమిస్తున్నాని బీల్వర్ మరో సారి గొడవకు దిగాడు. ఎన్ని రోజులు ఉన్నా నిన్ను చంపేస్తానని అమ్మాయి తండ్రిని బెదిరించి వెళ్లాడు. దీంతో బల్విర్ తల్లి, తండ్రులను పిలిపించి వారి సమక్షంలో నచ్చచెప్పి పంపించారు. దీనిని మనసులో పెట్టుకున్న బల్వీర్ ఆదివారం తాను వేసుకున్న ప్లాన్ ప్రకారం. షూటింగ్ ప్రాక్టిస్ కోసం కొనుగోలు చేసిన ఎయిర్ రైఫిల్ షార్ట్ గన్‌ను బ్యాగులో తీసుకొని తన బైక్‌పై ఆనంద్ ఇంటికి చేరుకున్నాడు. వెంటనే ఆనంద్‌పై ఒక రౌండ్ కాల్చాడు. తూటా కంట్లో నుంచి దూసుకెళ్లడంతో ఆయనకు తీవ్రగాయమైంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందుతుడిని అదుపులోకి తీసుకున్నారు. తీవ్రగాయానికి గురైన యువతి తండ్రిని ఆసుపత్రికి తరలించారు.



పిల్లలను ఓదార్చుతున్న మాజీమంత్రి కెటిఆర్

# ఇబ్బందైతే ఎమ్మెల్యే వదిలేస్తా

## సిరిసిల్ల ప్రజలపై సిఎం రేవంత్ కక్ష కట్టడం సరికాదు

## యేడాదిలో 34 మంది నేతన్నలు చనిపోయారు : కెటిఆర్

**సిరిసిల్ల బ్యూరో, నవంబరు 10, ప్రభాతవార్త:** సిరిసిల్లలో తాను ఎమ్మెల్యేగా ఉండడం ఇబ్బందైతే ఇక్కడి ప్రజలపై ప్రేమ కలుగుత లేదంటే ఆ ఎమ్మెల్యే పదవిని రేపే వదిలేస్తానని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఆర్థిక ఇబ్బందులతో చనిపోయిన యువజంట కుటుంబ సభ్యులను కెటి ఆర్ ఆదివారం రాత్రి పరామర్శించారు. చనిపోయిన దంపతుల పిల్ల లతో కెటిఆర్ మాట్లాడుతూ నా పిల్లలాంటివారు..ధైర్యంగా ఉండాలని అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎంత వరకు చదివితే అంత వరకు చదివించే బాద్యత తనదేనని చెప్పారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూఎమ్మెల్యే పదవి పెద్ద ముచ్చట కాదని ఈ రకంగా పగబట్టినట్లు మంచిగా నడుస్తున్న పరిశ్రమను చితికివేసే విదంగా కక్షగట్టి శాడిస్టులాగా చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిరిసిల్లలో పనులు లేక నేత కార్మికులు చనిపోతున్నారని ఆవేదన వ్యకం చేశారు. బిఆర్‌ఎస్ హాయంలో అంతకు ముందు పరిశ్రమ మంచిగా నడిచేదని కాంగ్రెస్ వచ్చిన తరువాత పట్టించుకునే వారు కరువయ్యారని మండిపడ్డారు. సరిగ్గా ఏడాది క్రితం కామారెడ్డి లో కాంగ్రెస్ పార్టీ బిసీ డిక్లరేషన్ పేరిట రాష్ట్రంలోని అన్ని బలహీన వర్గాల కుటుంబాలకు అందమైన రంగులకళను చూపెట్టారని, ఐదేండ్లలో బిసీ అభ్యున్నతికి లక్ష కోట్లు ఖర్చు పెడుతామని, కుల వృత్తులను ఆదరిస్తామని సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ తెస్తామని కెసిఆర్ కంటే నేతన్నలకు అధికంగా ఆర్డర్లు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి పొడిచిన వెన్నుపోటుతో సిరిసిల్లలో 20 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. నెలకు 25 వేలు సంపాదించే యువజంట ఏడాదిగా ఎలాంటి పనిలేక అప్పులు కావడంతో దిక్కులేని దుస్థితిలో ఉరి వేసుకున్నారని పెర్కోన్నారు. తిరిగి సిరిసిల్లలో ఆత్మహత్యల పరంపర కొనసాగుతుందని మొత్తం రాష్ట్రంలో 34 మంది చనిపోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. వృత్తిదారులపై ప్రేమ ఉంటే పించన్ 4 వేలు చేయాలని, మహిళలకు 2,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో 2 రోజులుగా పెరుగుతున్న చలి

## చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 10:** తెలంగాణ రాష్ట్రంలో చలి బాగా పెరిగింది. రెండు,మూడు రోజులుగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రత 20 డిగ్రీలకన్నా దిగువకు పడిపోతోంది. ముఖ్యంగా నల్లమల అటవీ ప్రాంతం ఎక్కువగా వ్యాపించి ఉండడంతో నాగర్‌కర్నూల్ జిల్లాలో మరింత చలి పంజా విసురుతోంది. ఈ నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. చలి కాలంలో అనేక వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. మంచు విపరీతంగా ఉండటం వల్ల మనిషి రక్త నాళాలు, కండరాలు కుచించుకుపోయి పలు రకాల వ్యాధులకు గురవుతుంటారు. ఈ సమయంలో ప్రతి ఏడాది ఆసుపత్రుల్లో వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరిగే అవకాశం. నిత్యం వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గత రెండ్రోజుల నుంచి మరో 300 మేరకు పెరిగింది. శీతాకాలంలో ప్రారంభంలోనే గాలిలో వచ్చే మార్పులకు జ్వరం, జలుబు, తలనొప్పి, దగ్గు, శ్వాస కోశ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ చలి కాలం జనవరి,ఫిబ్రవరి వరకు ఉంటుంది. ముఖ్యంగా నవంబరు,డిసెంబర్‌లో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముంది. ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధుల్లో శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. శీతాకాలంలో ఎక్కువగా జలుబు అయి ముక్కు కారుతుంటుంది.దీంతో చెవి దగ్గర గడ్డలా వాపు వచ్చే అవకాశాలు సైతం ఉన్నాయి. దీని వల్ల శ్వాస తీసుకోవడం సమస్యగా మారుతుంది. కండరాలు బిగుసుకుపోవడంతో మోచేయి, మోకాలు, ఇతర జాయింట్‌లలో నొప్పులు వస్తుంటాయి. రక్తనాళాలు కుచించుకుపోతే గుండెకు బ్లడ్ సర్క్యులేషన్ లో ఇబ్బందులు ఏర్పడుతాయి. ఇది చాలా ప్రమాదకరం. శ్వాస నాళిక కండరాలు బిగుసుకు పోతాయి. దీంతో గాలి పీల్చడంలో ఇబ్బంది ఉంటుంది. చర్మసంబంధమైె వ్యాధులు నుంచి దూరంగా ఉండేందుకు మాయిశ్చరైజర్ వాడాలి. ఏదైనా అనారోగ్య సమస్యగా కన్పిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. చలికాలంలో కూల్ గా ఉండే పదార్థాలకు దూరంగా ఉండాలి. వేడివేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. శరీరం వెచ్చగా ఉండేలా చూసుకోవాలి.

ఐస్‌క్రీం, చల్లగా ఉన్న నీళ్లను, జూస్‌ను తాగడం వల్ల జలుబు, శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. వాటికి దూరంగా ఉండాలి.

శరీరానికి వేడినిచ్చే జొన్నలు, ఆకుకూరలు, సజ్జలు వంటి ఆహారంగా తీసుకోవాలి. గోరు వెచ్చని నీటిని మాత్రమే తాగాలి. రాత్రి వేళలో బయటకు వెళ్లకుండా ఉండాలి. అత్యవసరం అయితే తప్పనిసరిగా చలి నుంచి శరీరాన్ని రక్షించే ఉన్ని దుస్తులు ధరించాలి. చెవుల్లోకి చల్లని గాలి వెళ్లకుండా రక్షణ కలిగించే దుస్తులు వేసుకోవాలి.

చిన్న పిల్లలను బయటకు వెళ్లనీయకుండా కుటుంబ సభ్యులే పలు జాగ్రత్తలు తీసుకోవాలి.చలికాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల ఇంట్లో వైరస్‌లు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. అందుకు ఇంట్లో, ఇంటి పరిసరాలను ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలి.తరచూ చేతులను సబ్బుతో కడుక్కోవాలి. ఆస్తమా ఉన్న వారు తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలి. మరీ ఇబ్బందిగా ఉంటే కచ్చితంగా వైద్యులను సంప్రదించాలి. చలి కాలంలో చల్లటి పదార్థాలు కాకుండా వేడి ఆహారపదార్థాలను, వేడి నీళ్లను మాత్రమే తీసుకోవాలి.జలుబు, దగ్గు ఉన్న వారు తప్పనిసరిగా చేతిరుమాలు వెంట పెట్టుకుని అడ్డుపెట్టుకోవాలి.



# వన్డే సిరీస్ పాకిస్థాన్ కైవసం

### 2-1 తేడాతో ఆస్ట్రేలియా ఓటమి

**ఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌లో పాక్ చాలా రోజుల తర్వాత తమ స్థాయి మేర రాణించింది. ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపై మట్టి కరిపించి వన్డే సరీస్‌ను కైవసం చేసుకోవడం విశేషం. ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను పాకిస్తాన్ 2-1 తేడాతో ఆధిక్యం సంపాదించింది. ఆదివారం జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 31.5 ఓవర్లలో 140 పరుగులకే కుప్ప కూలింది. పాక్ పేసర్లు షాహీన్ అఫ్రిది 3/32, నసీం షా 3/54, హారీస్ రౌఫ్ 2ఝ24, మోహ్మద్ హస్నైన్ 1/24తో ఆస్ట్రేలియా పతనాన్ని శాశించారు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో సీన్ అబాట్ 30 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా, మాథ్యూ షార్ట్22 పరుగులు, ఆరోన్ హార్డీ 12 పరుగులు, ఆడమ్ జంపా 13 పరుగులు, స్పెన్సర్ జాన్సన్ 12 పరుగులతో నాటౌట్‌గా రెండంకెల స్కోరు చేశారు. జేక్‌ఫ్రేజర్ మెక్‌గుర్క్ 7 పరుగులు, కెప్టెన్ జోస్ ఇంగ్లిస్ 7 పరుగులు, కూపర్ కన్నోలీ 7 పరుగులు, మార్కస్ స్టోయినిస్ 8 పరుగులు చేయగా, గ్లెన్ మ్యాక్స్‌వెల్, లాన్స్ మోరిస్ ఒక్క పరుగు కూడా దారుణంగా విఫలమయ్యారు. అనంతరం 141 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన పాకిస్తాన్ 26.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింఇ. పాక్ ఇన్నింగ్స్‌లో సైమ్ అయూబ్ 42 పరుగులు, అబ్దుల్ల షఫీక్ 37 పరుగులతో రాణించగా, బాబర్ అజమ్ 28 పరుగులు, మొహమ్మద్ రిజ్వాన్ 30 పరుగలు చేసి అజేయంగా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో లాన్స్ మోరిస్‌కు 2 వికెట్లు దక్కాయి. కాగా, ఈ సిరీస్‌లో తొలి వన్డేలో ఆస్ట్రేలియా గెలుపొందగా, పాకిస్థాన్ వరుసగా రెండు, మూడు వన్డేల్లో జయకేతనం ఎగురవేసింది.



# ప్రపంచ ఛాంపియన్ పంకజ్

### 28వ సారి టైటిల్ సాధించిన భారత్ స్టార్

**హైదరాబాద్:** భారత్ దిగ్గజ క్యూయిస్టు, స్టార్ ఆటగాడు పంకజ్ అధ్వానీ ప్రపంచ ఛాంపియన్‌గా చరిత్ర సృష్టించాడు. తనకు సాటి మరెవరూ లేరని మరోసారి నిరూపించారు. ఒకటి కాదు, రెండు కాదు, పది కాదు, 28 సార్లు ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌గా నిలిచి కొత్త చరిత్ర లిచంచాడు. దోహా వేదికగా ముగిసిన ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో పంకజ్ 4-2తో ఇంగ్లండ్‌కు చెందిన రాబర్ట్ హాల్‌పై చిరస్మరణీయ విజయం సాధించాడు. ఆసక్తికరంగా సాగిన తుది పోరులో హాల్ తొలి గేమ్‌ను కైసవం చేసుకోగా, ఆ తర్వాత పంకజ్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండు, మూడు గేములు గెలిచి జోరు మీదున్న పంకజ్‌కి రాబర్ట్ హాల్ నాలుగు, ఐదు గేముల్లో చెక్ పెట్టాడు. దీంతో వీరిద్దరి మధ్య పోరు ఉత్కంఠభరితంగా మారింది. చివరి గేమ్‌లో గెలిచిన పంకజ్ టైటిల్‌ను తన ఖాతాలో మరోసారి వేసుకున్నాడు. కాగా 2016 నుండి వరుసగా ప్రపంచ టైటిళ్లు కొల్లగొడుతున్న పంకజ్‌కు ఇది వరుసగా 7వ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. పంకజ్ సుదీర్ఘ ఫార్మాట్‌లో 9 సార్లు టైటిల్‌ను గెలుచుకున్నాడు. గతంలో అతడు పాయింట్ల ఫార్మాట్‌లో 10 సార్లు, లాంగ్ ఫార్మాట్‌లో 8 సార్లు, స్నూకర్‌లో 8 సార్లు, టీమ్ ఫార్మాట్‌లో ఒకసారి ప్రంచ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక 1999లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన పంకజ్ ఇంగ్లండ్‌లో జరిగిన ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నడు. 2005లో ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. గ్రాండ్ డబుల్ సాధించిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించి భారత్‌కు బంగారు పతకాన్ని అందించాడు. 2010 ఆసియా క్రీడల్లో సింగిల్స్‌లో పాల్గొని స్వర్ణాన్ని సాధించాడు. 2006 ఆసియా క్రీడల్లోనూ స్వర్ణం కైవసం చేసుకున్నాడు.



### ఐఎస్‌ఎల్ ఫుట్‌బాల్ సూపర్ లీగ్‌లో..

# 1000వ మ్యాచ్ డ్రా

**ఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) చరిత్రలో 1000 ఫుట్‌బాల్ మ్యాచ్ డ్రా గా ముగిసింది. ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్, చెన్నాయిస్ ఫుట్‌బాల్ క్లబ్ మధ్య జరిగిన పోరులో 1-1 గోల్స్‌తో డ్రా అయింది. ముంబై జట్టు తరపున నాదన్ రోడ్రిగ్స్ 53వ నిమషంలో ఒక గోల్ సాధించగా, చెన్నైయన్ జట్టు తరఫున కెప్టెన్ ర్యాన్ ఎడ్వర్డ్స్ 60వ నిముషంలో ఏకైక గోల్ సాధించాడు. ఈ మ్యాచ్ ఆరంభం నుండి ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు పోరాడాయి. ఇరు జట్లు చెరో 14 షాట్లు ఆడగా, అందులో ప్రత్యర్థి గోల్ పోస్ట్ లక్ష్యంగా నాలుగేసి సార్లు దాడులు చేశాయి. ముంబై జట్టు చిన్న చిన్న పాస్‌లతో ముందుకు సాగగా, చెన్నాయన్ జట్టు 15 ఫౌల్స్ చేసింది. ఈ ఫలితంతో 8 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 3 పరాజయాలు, 2 డ్రాలు నమోదు చేసుకున్న చెన్నాయన్ జట్టు 12 పాయింట్లతో పట్టికలో 4వ స్థానానికి చేరగా, 10 పాయింట్లు ఖాతాలో ఉన్న మంబై జటుటన 8వ స్థానంలో ఉంది. ఇక ఈస్ట్ బెంగాల్, మొహమ్మదాన్ స్పోర్ట్స్ క్లబ్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కూడా 0-0తో డ్రాగా ముగిసింది. ఇరు జట్లు గోల్ సాధించడంలో విఫలమయ్యాయి.



### ఐపిఎల్ మెగా వేలంలో..

# ఈ ప్లేయర్లు టూ మచ్ కాస్ట్

### టీమిండియాలో వీరు లక్కీ

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025కు సంబంధించి ఆటగాళ్ల మెగా వేలానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల చివరి వారంలో మెగా వేలం జరగనున్నందున ఫ్రాంచైజీలు సత్తా కలిగిన ఆటగాళ్లపై దృష్టి సారించాయి. ఈ మెగా వేలం కోసం మొత్తం 1,574 మంది ప్లేయర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో 1,165 మంది భారత్‌తో పాటు, మరో 409 మంది విదేశీ ప్లేయర్లు ఉన్నారు. వీరిలో కొందరు ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీల మధ్య గట్టి పోటీ ఎదురుకానుంది. దీంతోఅత్యంత ఖరీదైన ఐదుగురుప్లేయర్లపై వివిధ ఫ్రాంచైజీలు దృష్టిసారించాయి. ఐపీఎల్-2016 నుండి ఢిల్లీ క్యాపిటల్స్‌లో రిషబ్ పంత్ కీలకంగా వ్యవహరించాడు. అయితే అనూహ్యంగా ఢిల్లీ క్యాపిటల్స్ రిటైన్ చేసుకోకుండా అతడిని విడుదల చేసింది. ఈసారి వేలంలో రిషబ్‌ను చెన్నై సూపర్ కింగ్స్ భారీగా కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. రిషబ్ కోసంఇతర ఫ్రాంచైజీలు సైతంకొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. వేలంలో పెద్ద బిడ్‌లు వేయడానికి కూడా వెనుకాడని పరిస్థితి ఉంది. పంత్ ఎలాంటి ప్రమాదరకమైన ఆటగాడో అనేది తెలిసిన ఫ్రాంచైజీలు అతని కోసం ఎదురు చూస్తున్నాయి. అలాగే గత ఐపీఎల్ లో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో కోల్‌కతా నైట్ రైడర్స్ 3వ టైటిల్ గెలుచుకుంది. అయినప్పటికీ కోల్‌కతా అతనిని ఉంచుకోలేదు. పెద్ద ఫ్రాంచైజీలు ఇప్పటికే శ్రేయస్‌తో టచ్‌లోఉన్నాయి. అతనిని తమజట్టుకు కెప్టెన్సీ చేయాలని కోరుతున్నాయి. దీంతో వేలంలో ఈ భారత్ ఆటగాడిపై కోట్లు కురిపించేందుకు రెడీ అవుతున్నాయి. ఇక చాలా కాలం తర్వాత ఇంగ్లండ్ వైట్ బాల్ కెప్టెన్ జోస్ బట్లర్ కూడా వేలంలో అమ్మకానికి రానున్నాడు. ప్రతీ ఫ్రాంచైజీ తమ జట్టులోబట్లర్ వంటిప్రమాదకరమైన బ్యాట్స్‌మన్‌ను చేర్చుకోవాలని చూస్తున్నాయి. ఈ సారి అతడిని రిటైన్ చేయకూడదని రాజస్థాన్ రాయల్స్ నిర్ణయించుకోవడం ఆశర్యపరిచింది. బట్లర్ ఇప్పటి వరకూ ఐపీఎల్‌లో ఆడిన 17 మ్యాచ్‌ల్లో 7 సెంచరీలు, 19 హాఫ్ సెంచరీలతో కలిపి మొత్తం 3582 పరుగులు చేశాడు. ఇతనికోసం వివిధ ఫ్రాంఛైజీలు ఎంత సొమ్ము అయినా ఖర్చు చేసేందుకు వెనుకాడడం లేదు. కాగా ఐపీఎల్-2025 కోసం లక్నో సూపర్ జెయింట్స్ కేఎల్‌రాహుల్‌ను రిటైన్ చేయలేదు. ఫ్రాంచైజీ ఐదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకుని రాహుల్‌ను బయటకు పంపించింది. ఐపీఎల్‌లో కెప్టెన్‌గా వ్యహరించిన అనుభవం రాహుల్‌కు ఉంది. అతని సామర్థ్యాన్ని చూసి చాలా ఫ్రాంచైజీలు అతడిని తమ జట్టులో భాగం చేయాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి. అలాగే లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ గత 6 సీజన్లలో పంజాబ్ కింగ్స్ జట్టులో భాగంగా ఉన్నాడు. కానీ ఈ సారి ఫ్రాంచైజీ అతన్ని రిటైన్ చేయలేదు. ఇది పంజాబ్ పెద్ద తప్పిదం చేసినట్లయింది. మెగా వేలంలో అర్షదీప్ వంటి ప్రతిభావంతులైన బౌలర్‌ను కొనుగోలు చేయడం ఆ ఫ్రాంచైజీకి అంత సులభం కాదు. అతడు 65 మ్యాచ్‌ల్లో 76 వికెట్లు తీశాడు. అనేక ఇతర ఫ్రాంచైజీలు అర్షదీప్‌ను కొనుగోలు చేయడానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి.





# టి20లో ఇంగ్లండ్ శుభారంభం

### 8 వికెట్ల తేడాతో వెస్టిండీస్ ఓటమి

**ఢిల్లీ:** వెస్టిండీస్‌తో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. బార్బోడస్ వేదికగా జరిగిన తొలి టీ20లో వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. విండీస్ బ్యార్లలో నికోలన్ పూరన్ 38 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, రస్సెల్ 30 పరుగులు, రొమారియో షెపర్డ్ 35 పరుగులతో రాణించారు. మిగిలిన బ్యాటర్లలో బ్రాండన్ కింగ్ 3 పరుగులు, ఈవెన్ లీవ్స్ 13 పరుగులు, రూథర్‌ఫర్డ్ 2 పరుగులు, అచల్ హుస్సేన్ 2 పరుగులుతో సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా, సిమ్రాన్ హెట్‌మయర్, షామర్ జోసెఫ్ ఒక్క పరుగు కూడా చేయకుండా విఫలమయ్యారు. ఇక ఇంగ్లండ్ బౌలర్లలో షకీబ్ మహ్మద్ 4 వికెట్లు పడగొట్టగా, ఆదిల్ రషీద్ 3 వికెట్లు, ఓవర్టన్, లివింగ్ స్టోన్ తలా ఒక వికెట్ సాధించారు. అనంతరం 183 పరుగుల భారీ లక్ష్యాన్ని 16.5 ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయిన ఇంగ్లండ్ ఊదిపడేసింది. ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. 54 బంతులు ఎదుర్కొని 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 103 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు, జాకబ్ బెతల్ 58 పరుగులతో హాఫ్ సెంచరీ చేసి మెరిశాడు. వెస్టిండీస్ బౌలర్లలో మోటీ, షెపర్డ్ తలా ఒక వికెట్ మాత్రమే సాధించారు.

# ఈక్విటీల్లోనూ క్రెడిట్ కార్డు యూసేజ్


**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారతదేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగింది. ప్రస్తుతం కార్డుల వినియోగం ప్రమాదకర స్థాయిలకు చేరుకుంటుందని నిపుణులు సైతం హెచ్చరించిన సంగతి తెలిసిందే. సాధారణంగా షాపింగ్, కిరాణా కొనుగోళ్లు, గృహోపకరణాల కొనుగోళ్లకు ప్రధానంగా క్రెడిట్ కార్డులను భారతీయులు ఉపయోగిస్తుంటారు. వీటిని ఎక్కువగా క్యాష్ బ్యాక్స్, రివార్డ్స్, ఇఎంఐ ఎంపికల కోసం ఉపయోగిస్తుండటం మనకు సాధారణంగా తెలిసిందే. క్రెడిట్‌కార్డులు సాధారణంగా 40రోజులు క్రెడిట్ సైకిల్ కలిగి ఉంటాయి. ఈ కాలంలో యూజర్లు తమకు అవసరమైన వస్తువులను ధరలు చూడకుండా కార్డు సహాయంతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ స్టోర్లలో కొనుగోలు చేయటం మనం గమనిస్తూనే ఉన్నాం. అయితే ఈ ఆర్థిక సాధనాన్ని పెట్టుబడి



కోసం ఉపయోగించవచ్చనే విషయం మనలో చాలా మందికి అస్సలు తెలియదు. అయితే పెట్టుబడులకు దీనిని సద్వినియోగం చేసుకోవటం వల్ల కార్డు ద్వారా అదనపు ఆదాయాన్ని, సంపదను సృష్టించుకోవటానికి వెసులుబాటు ఉంటుంది. ఉదాహరణకు మార్కెట్లో ఆకర్షనీయమైన వాల్యుయేషన్ ఉన్న షేర్లను గమనించినప్పుడు దానిలో ఇన్వెస్ట్ చేయాలని చాలా మందికి అనిపిస్తుంటుంది. అయితే ఈ క్రమంలో తమ వద్ద లిక్విడిటీ తక్కువగా ఉండటంతో చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. దీనిని అధిగమించటానికి క్రెడిట్ కార్డును వినియోగించవచ్చు లేదా సదరు మొత్తాన్ని కార్డుపై రుణంగా పొందవచ్చు. అప్పు చేసి డబ్బును పెట్టుబడిగా పెట్టడం సరైనది కానప్పటికీ కొన్ని సందర్భాల్లో మాత్రం ఆచరణీయమైన ఎంపికగా అన్వేషించవచ్చు. స్వల్పకాలిక ఫైనాన్సింగ్: సమీప భవిష్యత్తులో స్టాక్ పెరుగుతుందని మీకు ఖచ్చితంగా తెలిస్తే.. దీని నుంచి మంచి రాబడిని మిస్ కాకూడదు అనుకున్నప్పుడు మీరు పెట్టుబడి ప్రయోజనం కోసం క్రెడిట్ కార్డ్‌ని ఉపయోగించవచ్చు. అయితే ఇది ప్రమాదకరమైన ఎంపిక ఎందుకంటే ఇన్వెస్టర్ అంచనాలు తప్పితే నష్టాలతో పాటు ఫైనాన్స్ క్రంచ్ లిక్విడిటీ సమస్యలను కలిగించే ప్రమాదం ఉంది. అధిక నిల్వలను నివారించడం: మీరు పెట్టుబడి కోసం క్రెడిట్‌ని ఉపయోగించాలని ఎంచుకుంటే సకాలంలో మొత్తం బిల్లు చెల్లించటానికి డబ్బు ఉండేలా చూసుకోవటం ఉత్తమం. లేకపోతే లేటు పేమెంట్ల వల్ల కట్టాల్సి వచ్చేవడ్డీలభారం స్టాక్ పెట్టుబడుల నుంచి వచ్చిన లాభాలను ఆవిరి చేస్తుంది. నగదు అడ్వాన్స్: మీరు క్రెడిట్ కార్డ్ నుండి నగదు అడ్వాన్స్ కూడా తీసుకోవచ్చు. పెట్టుబడి కోసం డబ్బును ఉపయోగించవచ్చు. ఇది సాధారణంగా అధిక రుసుములు, వడ్డీ రేట్లతో వచ్చి ఖరీదైన ఎంపికగా మారుతుంది. అందువల్ల క్రెడిట్ కార్డుపై తీసుకునే లోన్ అధిక వడ్డీతో వచ్చినప్పుడు వచ్చే నష్టాలను ఇన్వెస్టర్లు ముందుగానే గుర్తించటం మంచిది. స్టాక్‌లలో పెట్టుబడి పెట్టడం అనేది స్వాభావిక నష్టాలను కలిగి ఉంటుంది. అరువు తెచ్చుకున్న డబ్బును ఉపయోగించడం వలన ఆ నష్టాన్ని పెంచుతుందని గుర్తించాల్సిన అంశం.

# ఎఐ, మెషిన్ లెర్నింగ్ రంగాల్లో పెరిగిన ఆఫర్లు

**ముంబై, నవంబరు 10:** ఎఐ, మెషిన్ లెర్నింగ్ (ఎఐ) వంటి నూతన టెక్నాలజీతో అక్టోబర్‌లో వైట్ కాలర్ జాబ్స్ 10శాతం పెరిగాయని నౌక్రి జాబ్‌స్పీక్ ఇండెక్స్ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ అండ్ గ్యాస్ (18%), ఫార్మా అండ్ బయోటెక్ (12%), ఎఫ్ఎంసిజి (8%), ఐటి (6%) ఈ నాలుగింటిలో గత ఏడు నెలల్లో ఐటీ ఉద్యోగ నియామకాల్లో గణనీయమైన వృద్ధి నమోదు చేసింది. ఎఐ, ఎంఎల్ రంగాల్లో అసాధారణంగా 39% వార్షిక, 2% నెల వారీ వృద్ధిని సాధించాయి. వైట్ కాలర్ నియామకాల్లో 28% పెరుగుదలతో ఐటి యునికార్న్లు అద్భుత పనితీరును ప్రదర్శిస్తున్నాయి. మొత్తంమీద గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జిసిసిలు) 17% వార్షిక పెరుగుదలతో స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయి. ఈ జిసిసిలలో కోల్‌కతా 68.46% వృద్ధి, అహ్మదాబాద్ 47.68% వృద్ధితో వేగంగా అభివృద్ధి చెందుతున్న సెంటర్లుగా నిలిచాయి. అంతర్జాతీయ కంపెనీలు భారత్‌లో తమ కార్యకలాపాల విస్తరణకు పెరుగుతున్న ప్రాధాన్యతను సూచిస్తున్నాయని తాజా సూచీలు నిర్ధారిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో డేటాసెంట్రిక్ రోల్స్ నియామకాలు అక్టోబరులో వృద్ధికి దారితీశాయని ఇండెక్స్ హైలైట్‌చేసింది. 24% వార్షిక వృద్ధితో తమిళనాడు అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాత స్థానాల్లో 16 శాతంతో తెలంగాణ, 12 శాతంతో కర్ణాటక, 9 శాతంతో ఆంధ్రప్రదేశ్, 7 శాతంతో కేరళ నిలిచాయి. హైదరాబాద్, చెన్నై రీసెర్చ్ అండ్ అనలిటిక్స్ ఇండస్ట్రీ నియామకాల్లో అగ్రగామిగా ఉన్నాయి. ఇవి వరుసగా 51, 50ఆకట్టుకునే రీతిలో వృద్ధిని కొనసాగిస్తున్నాయి. కొచ్చిన్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బిఎఫ్ఎస్ఐ) 40శాతం వార్షిక పెరుగుదలను సూచిస్తుంది. 2024లో మందగమనంలో సాగుతున్న ఫ్రెషర్స్ నియామకాలు అక్టోబర్‌లో 6% వార్షిక పెరుగుదలతో సానుకూలంగా మారింది. ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ డిజైన్‌లో 57%, కెపిఒ అండ్ అనలిటిక్స్ 39%, అగ్రికల్చర్ అండ్ డైరీ 36% రంగాలు ఫ్రెషర్స్ నియామకాల్లో పెరుగుదలకు దోహదం చేశాయని చెప్పవచ్చు. ముఖ్యంగా ఫ్రెషర్స్ నియామకాల్లో వేగం వ్యాపార విస్తరణకు బలమైన సూచికని, రాబోయే గ్రాడ్యుయేట్‌లకు మరిన్ని అవకాశాలను అందిస్తుందని నౌక్రి చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ అన్నారు.



# వాణిజ్యం

# పసిడి పెట్టుబడులతో లాభాలే!


**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారతదేశ ప్రజలకు బంగారంతో అవినాభావ సంబంధం ఉంది. యేళ్లుగా బంగారాన్ని కేవలం పెట్టుబడిగా కాకుండా ఆభరణాలు వాడడం పరిపాటి. భారతదేశంలో బంగారం లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఒక్కసారిగా పెట్టుబడిదారులంతా బంగారం బాట పట్టడంతో సామాన్యుడికి అందుబాటులో లేని విధంగా బంగారం ధర పైపైకి ఎగబాకింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ విశ్లేషణ ప్రకారం బంగారం ప్రస్తుతం సానుకూలంగా స్థిరంగా ఉంది. పెట్టుబడిదారులకు వారి పోర్ట్‌ఫోలియోలలోని ఇతర విభాగాలలో కొనుగోలు శక్తిలో పతనాన్ని భర్తీ చేయడంలో సహాయపడుతుంది. భారతదేశం, యునైటెడ్ స్టేట్స్ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలు పెరుగుతున్న ఇంధన వ్యయాలు వంటి అంతరాయాల కారణంగా ద్రవ్యోల్బణ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ కారణంగా, బంగారం చాలా సురక్షితమైన ఎంపిక అవుతుంది. బంగారం పోర్ట్‌ఫోలియో డైవర్సిఫికేషన్‌లో గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా స్టాక్స్‌లో పెట్టుబడికి వెళ్లే వారు తమ పెట్టుబడిని కొంత మేర బంగారంలోకి మళ్లిస్తే తక్కువ నష్టాలతో బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. సెంట్రల్ బ్యాంకుల వడ్డీ రేటు విధానాలు కూడా బంగారం డిమాండ్‌ను గణనీయంగా ప్రభావితం చేస్తాయి. ద్రవ్యోల్బణం సమయంలో ఆర్థిక వ్యవస్థను మందగించడానికి అనేక కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచుతాయి. అయినప్పటికీ పెరుగుతున్న వడ్డీ రేట్లు రుణ వ్యయాలను పెంచుతాయి. ఇది వినియోగదారుల వ్యయం తగ్గడానికి, అలాగే ఆర్థిక వృద్ధిని మందగించడానికి దారితీస్తుంది. దీంతో పెట్టుబడిదారులు బంగారం వైపు మళ్లుతారు. కాబట్టి బంగారం ధర పెరుగుతుంది. ముఖ్యంగా యువ పెట్టుబడిదారులు బంగారం సామర్థ్యాన్ని గుర్తించడం ఇప్పటికే ప్రారంభించారని నిపుణులు చెబుతున్నారు. క్రిప్టోకరెన్సీ వంటి అధిక అస్థిరత పెట్టుబడులకు ఇది స్థిరమైన ప్రత్యామ్నాయంగా ఉంది. బంగారం అధిక వృద్ధి స్టాక్స్‌లా వేగవంత



మైన రాబడిని అందించనప్పటికీ ఇది దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాలకు, ప్రత్యేకించి మూలధనాన్ని కాపాడుకోవాలనుకునే వ్యక్తులకు విలువైనదిగా ఉంటుంది. ఇన్వెస్టర్లు ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా హెడ్జ్, అస్థిరతకు వ్యతిరేకంగా బఫర్ లేదా సంపదను సంరక్షించే మార్గాన్ని కోరుకునే వారు బంగారంలో పెట్టుబడికి ముందుకు వస్తారు. భవిష్యత్‌లో ఎక్కువరాబడి కావాలనే దృష్టితో బంగారం కొనుగోలు చేస్తే మాత్రం ఇది మంచి ఎంపిక కాదని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే ఉన్న బంగారం విక్రయించాలనుకునే వారికి ఈ ధరలో విక్రయించడం మేలని సూచిస్తున్నారు.

# ఐపిఒకు 'పరమేసు బయోటెక్'

**ముంబై, నవంబరు 10:** ఐపీవో ఫ్లోట్ చేసేందుకు సెబి వద్ద దరఖాస్తు చేసుకున్న పరమేసు బయోటెక్ కంపెనీ, సెబి నుంచి ఆమోదం కోసం వెయిట్ చేస్తున్న కంపెనీ మొక్కజొన్న ఉత్పత్తుల తయారీలోఉంది. కంపెనీ తాజా ఐపీవోద్వారా దేశీయ స్టాక్‌మార్కెట్ల నుంచి రూ.600కోట్లను సమీకరించాలనిచూస్తోంది. అయితే ఇందులో రూ.520కోట్లకు తాజా ఈక్విటీ ఇష్యూ ఉండగా, మిగిలిన రూ.80 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ కింద కంపెనీ విక్రయించాలని చూస్తోంది. పాంటోమత్ కేపిటల్ అడ్వైజర్స్ ఏకైక బుక్‌రన్నింగ్ లీడ్ మేనేజర్. కంపెనీ తాజాఐపీవో నుంచి సమీకరించిన సమీకరించే డబ్బుతో రూ.330 కోట్లను మధ్యప్రదేశ్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ రోజుకు 1200 టన్నుల ఉత్పత్తి సామర్థంతో ఏర్పాటు చేయబడనుంది. అలాగే ఇదే క్రమంలో ఐపీవో ద్వారా వచ్చిన సొమ్ములో రూ.85 కోట్లను కంపెనీ తన రుణాల చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన మెత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఉపయోగించాలని చూస్తోంది. వాస్తవానికి 2011లో స్థాపించబడిన పరమేసు బయోటెక్ దేశంలో మొక్కజొన్న ఆధారిత ప్రత్యేక ఉత్పత్తుల తయారీలో అతిపెద్ద ఆటగాడిగా కొనసాగుతోంది. కంపెనీ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోలో దేశీ మొక్కజొన్న స్టార్చ్, మార్పులు చేసిన మొక్కజొన్న స్టార్చ్, లిక్విడ్ గ్లూకోజ్, మాల్టోడెక్స్‌ట్రిన్ పౌడర్, గ్లూటెన్ ఉన్నాయి.



# ఒరాకిల్‌లో ఉద్యోగులకు ఉద్వాసన

**వాషింగ్టన్, నవంబరు 10:** అమెరికాకు చెందిన ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ ప్రపంచ వ్యాప్తంగా కస్టమర్లతో పాటు భారతదేశంలో భారీగా ఉద్యోగులను కలిగి ఉన్న సంగతి తెలిసిందే. ఐటీ నుంచి హెల్త్ కేర్ వరకు అనేక రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న టెక్ దిగ్గజం తాజాగా నవంబర్ 1 నుంచి ఉద్యోగుల కోతలకు తెర లేపింది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఒరాకిల్ కార్పోరేషన్ దాని ఒరాకిల్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారవిభాగంలో ఉద్యోగుల కోతలు ప్రకటించింది. కొన్ని నివేదికల ప్రకారం ఒరాకిల్ తన వ్యాపారం అంతటా వివిధ విభాగాల్లో భారీగా ఉద్యోగుల కోతలు ఉంటాయని సూచించాయి. అయితే ఈ లేఆఫ్స్ ప్రభావం వందల మందిపై ఉండనున్నట్లు సమాచారం. కొంతమంది అధిక పనితీరు ఉన్నవారితో సహా 15 మంది ఉద్యోగులను లేఆఫ్ చేసినట్లు వెల్లడైంది. తాజా లేఆఫ్స్ వల్ల 15,000 మంది ప్రభావితం అవుతారని తెలుస్తోంది. వందలాది మందికి లేఆఫ్స్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో ప్రసిద్ధి చెందిన ఒరాకిల్ గతంలోనూ కొన్ని తొలగింపులను ప్రకటించిన సంగతి తెలిసిందే. శ్లాక్‌లో చాలా మంది ఉద్యోగులు పోవటం చూస్తుంటే వారాంతం నాటికి మరింత మంది ఉద్యోగుల లేఆఫ్ ఉండొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వేతనం ఎక్కువ స్థాయిలో ఉన్న టెక్కీలను తొలగించి వారి స్థానాల్లో ఫ్రెషర్లను తీసుకునే ఉద్దేశ్యంలో కంపెనీ ఉన్నట్లు ఒకరు వ్యాఖ్యానించారు. ప్రస్తుత లేఆఫ్స్ అమెరికా వ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభావితం చేసినట్లు వెల్లడైంది. ఒరాకిల్ ఇతర ఉద్యోగ కోతలను ప్రకటించిన నెల తర్వాత ఈ తాజా రౌండ్ తొలగింపులు వచ్చాయి. ఇందులో అమెరికా, యూరప్ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లోని ఉద్యోగులు ఉన్నారు. అతిపెద్ద కంపెనీల్లో ఒకటిగా ఉన్న ఒరాకిల్ ప్రతి నెల ఉద్యోగుల తొలగింపులను చేస్తూనే ఉంటుందని ఒకరు పేర్కొన్నారు. కంపెనీ ఈ ఉద్యోగ స్థానాలను భారత్ వంటి మార్కెట్లలో తక్కువ ఖర్చుకు దొరికే ఉద్యోగులతో భర్తీ చేయవచ్చని తెలుస్తోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.